RNI NO. APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

ప్రజాగళం PGN NEWS

నిజామాబాద్ | సంపుటి:21 | సంచిక: 166 | పబ్లిషర్. కొక్కు రవికుమార్ | మంగళవారం 2 డిసెంబర్ 2025 | పేజీలు: 8 | వెల: రూ 1/-

## దేశ యువశక్తికి 'స్కైరూట్ ఇన్ఫినిటీ' క్యాంపస్ ప్రతిబింబం

### 'మన్ కీ బాత్'లో హైదరాబాద్ స్టార్టప్‌పై మోదీ ప్రశంసలు

న్యూఢిల్లీ : భారతదేశ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థకు.. హైదరాబాద్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస'కు చెందిన ఇన్ఫినిటీ క్యాంపస్ కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఈ కేంద్రం దేశంలోని నవీన ఆలోచన, ఆవిష్కరణ, యువశక్తికి ప్రతిబింబంగా నిలిచిందని కొనియాడారు. 128వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన.. హైదరాబాద్‌కు చెంది న ఈ స్టార్టప్ సంస్థపై ప్రసశంసలు కురిపించారు. అలాగే.. ప్రపంచంలోనే అతిపెద్ద లీప్ ఇంజిన్ 'మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ (ఎంఆర్‌వో)' సౌకర్యాన్ని ఇటీవలే హైదరాబాద్‌లో ప్రారంభించినట్టు వెల్లడించారు. విమాన నిర్వహణ, మరమ్మత్తు, పునఃపరిశీలన రంగంలో మనదేశం కీలక ముందడుగు వేసిందన్నారు. అలాగే.. 'వోకల్ ఫర్-లోకల్'ను ప్రోత్సహించే క్రమంలో.. పలు దేశాల ప్రధానులకు కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ నైపుణ్యాన్ని పరిచయం చేశానని, వివిధ కళాకృతులను వారికి బహూకరించానని వెల్లడించారు.




## మేడారం పనుల నాణ్యతలో రాజీ పడొద్దు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సీఎం రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. నిర్మాణపనులపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గద్దెల దగ్గరలో ఉన్న చెట్లను తొలగించవద్దని సీఎం సూచించారు. పనుల నాణ్యతలో ఏమాత్రం రాజీపడొద్దన్నారు. నిర్మాణంలో చిన్న విమర్శలకు కూడా తావు ఇవ్వొద్దని, గద్దెల వద్ద వరదనీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గద్దెల వద్ద నాలుగువైపులా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. గుడి చుట్టూ పచ్చదనం కన్పించేలా అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు తదితరులు హాజరయ్యారు.




## ఫుడ్‌బాల్ దిగ్గజం మెస్సీతో మ్యాచ్ ఆడనున్న సీఎం రేవంత్

హైదరాబాద్, డిసెంబర్ 1: ప్రజాపాలనలో భాగంగా నిత్యం అధికారులతో సమీక్షలు, సమావేశాలతో బిజీగా ఉండే సీఎం రేవంత్ రెడ్డి ఫుడ్ బాల్ ప్రాక్టీస్ చేశారు. డిసెంబర్ 13న ఉప్పల్ స్టేడియంలో జరిగే ఫ్రెండ్లీ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో సీఎం పాల్గొంటారు. ఈ మ్యాచ్‌లో ఫుడ్‌బాల్ దిగ్గజం మెస్సీ పాల్గొననున్నారు. మెస్సీతో కలిసి సీఎం ఫుట్‌బాల్ ఆడనున్నారు. దీనిలో భాగంగా ఎంసీహెచ్‌ఆర్‌డీలో ఫుట్‌బాల్ ప్రాక్టీస్ ప్రారంభించారు. ఇక గోట్ ఇండియా టూర్ 2025 లో భాగంగా స్టార్ ప్లేయర్ మెస్సీ హైదరాబాద్‌లో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్‌లో అడుగుపెట్టనున్న మెస్సీకి ప్రభుత్వం ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇక గోట్ ఇండియా టూర్ 2025లో డిసెంబర్ 13న ఉప్పల్ స్టేడియంలో జరిగే ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో మెస్సీతో కలిసి సీఎం రేవంత్ పోటీ పడనున్నారు. మెస్సీ టీంతో తలపడే జట్టుకు ముఖ్యమంత్రి రేవంత్ కెప్టెన్సీ వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ స్కూల్స్‌కు చెందిన ఫుట్ బాల్ ప్లేయర్లు రేవంత్ టీంలో ఆడనున్నట్లు సమాచారం. ఆర్‌ఆర్ 9 జెర్సీతో సీఎం బరిలోకి దిగనున్నారు. ఫుట్‌బాల్ అంటే సీఎంకు ఎంతో ఇష్టమనే విషయం తెలిసిందే. ఈక్రమంలో ఎంతో బిజీ ఉన్నప్పటికీ ఈ మ్యాచ్ కోసం సీఎం రేవంత్ ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్న సీఎం రేవంత్ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అలాగే ఈ ఫోటోలను కాంగ్రెస్ శ్రేణులు, రేవంత్ అభిమానులు షేర్ చేస్తున్నారు.

## ఫలించిన మంత్రి తుమ్మల చర్చలు.. పత్తి కొనుగోళ్లపై తొలగిన ప్రతిష్టంభన



హైదరాబాద్: రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లపై జిన్నింగ్ మిల్లులు, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మధ్య నెలకొన్న ప్రతిష్టంభన తొలగింది. సీసీఐ తీసుకొచ్చిన కొన్ని నిబంధనలను రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లులు వ్యతిరేకించడంతో ఇటీవల కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సమస్యపై దృష్టి సారించి.. సీసీఐ, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో పలు దఫాలుగా చర్చలు నిర్వహించారు. ఈ అంశంపై కేంద్ర మంత్రులతో పాటు సీసీఐ సీఎండీతో మాట్లాడి.. నిబంధనల్లో మార్పులు చేసేందుకు అంగీకరించేలా ఒప్పించారు. దీంతో రాష్ట్రంలో నోటిఫై చేసిన మొత్తం 330 మిల్లుల్లో పత్తి కొనుగోళు తిరిగి ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో ఇప్పటి వరకు సీసీఐ మొత్తం 3.66 లక్షల టన్నుల పత్తిని సేకరించింది. రైతుల వద్ద నిల్వ ఉన్న పత్తిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేసేలా ఇకపై సీసీఐ, జిన్నింగ్ మిల్లులు పనిచేస్తాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## లీజు భూములను కన్వర్షన్ చేసే అవకాశం ఇవ్వలేదు: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్: హిల్ట్ పాలసీపై విపక్షం అవాస్తవాలు ప్రచారం చేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. లీజుకు ఇచ్చిన ప్రభుత్వ భూములను కన్వర్షన్ చేసే అవకాశం ఇవ్వలేదని స్పష్టం చేశారు. పట్టాలు ఉండి.. సొంత భూములు ఉన్నవారికే కన్వర్షన్ ఫీజు పెట్టామని తెలిపారు. గత సర్కారే ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే జీవో ఇచ్చిందన్నారు. "భారత రాష్ట్ర సమితి హయాంలో ప్రభుత్వ భూములపై యాజమాన్య హక్కులను పారిశ్రామికవేత్తలకు ఇచ్చే జీవో తీసుకొచ్చారు. ఖాయిలా పడిన పరిశ్రమల భూములను వినియోగంలోకి తెచ్చే ప్రయత్నమే హిల్ట్ పాలసీ. ప్రభుత్వ భూమిపై హక్కును బదిలీ చేస్తున్నామనేది అబద్ధం. హిల్ట్ పాలసీలో ఎస్‌ఆర్‌వో రేటు కంటే ఎక్కువ ఫీజు నిర్ణయించాం" అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.




హైదరాబాద్: తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు నేతృత్వంలో పార్టీ ప్రతినిధుల బృందం గవర్నర్‌ను కలిసింది. హిల్ట్ పాలసీ పేరుతో రూ.వేలకోట్ల కుంభకోణం జరుగుతోందని ఫిర్యాదు చేసింది. అక్రమాలు జరగకుండా చూడాలని వినతిపత్రం అందజేసింది. గవర్నర్‌ను కలిసిన వారిలో భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, ఎన్వీ సుభాష్ తదితరులు ఉన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని భూములను బహుళ వినియోగ జోన్లుగా మార్చేందుకు ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్' (హిల్ట్) పాలసీని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. "హిల్ట్ పాలసీ ద్వారా అక్రమాలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 9 వేల ఎకరాలను రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు యత్నిస్తోంది. అప్పటి, ఇప్పటి ధరలు పోల్చి చూస్తే అక్రమాలు తెలుస్తున్నాయి. కోకాపేటలో భూముల ధర ఇటీవల ఎంత పలికిందో మనం చూశాం. ఈ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తోంది.

ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ డిసెంబర్ 7న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తాం. జీహెచ్‌ఎంసీ విస్తరణలోనూ అనేక కుట్రలు ఉన్నాయి" అని నేతలు ఆరోపించారు.




హైదరాబాద్: తెలంగాణలోని మహిళా సంఘాల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊతమిచ్చింది. మహిళా సంఘాలకు మరో 448 అద్దె బస్సులు కేటాయించింది. ఈ మేరకు ప్రభుత్వ నిర్ణయాన్ని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. రాష్ట్రంలో మహిళాశక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల ద్వారా బస్సులను కొనుగోలు చేయించి, వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇప్పించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే మొదటి విడతలో ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లోని 150 మహిళా సంఘాలకు 150 బస్సులను కొనుగోలు చేసింది.

## తక్కువ రేట్లకే భూములు ధారాదత్తం.. సర్కార్‌పై బీజేపీ నేతల ఫైర్



హైదారాబాద్, డిసెంబర్ 1: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హిల్ట్ పాలసీని వ్యతిరేకిస్తూ ఈరోజు (సోమవాం) గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను బీజేపీ నేతలు కలిశారు. సర్కార్ తీసుకొచ్చిన హిల్ట్ పాలసీపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. హిల్ట్ పాలసీని వ్యతిరేకిస్తూ గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇండస్ట్రియల్‌కు కేటాయించిన భూములను హిల్ట్ పేరుతో రియల్ ఎస్టేట్‌గా మారుస్తూ కోట్ల రూపాయలు అవకతవకలకు తెర లేపుతున్నారని ఆరోపించారు. మార్కెట్ వాల్యూ కన్నా తక్కువ రేట్లకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. 6 లక్షల 30 వేల కోట్ల విలువైన 9292 వేల ఎకరాల భూములను కేవలం 5 వేల కోట్లకు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందా..? పరిపాలన చేస్తుందా.. అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు పరచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందింది కాబట్టే ఇండస్ట్రియల్ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టి లబ్ధి పొందుతున్నారని వ్యాఖ్యలు చేశారు. హిల్ట్‌కు వ్యతిరేకంగా ఈనెల 7న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా చేపట్టబోతున్నామని ప్రకటించారు. హిల్ట్ పాలసీపై ప్రభుత్వంతో చర్చిస్తానని గవర్నర్ హామీ ఇచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు వెల్లడించారు. హిల్ట్‌పై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని.. ప్రభుత్వ వైఫల్యాను వ్యతిరేకంగా 7న నిరసన దీక్ష చేపట్టబోతున్నామని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రకటించారు. కాగా.. రామచందర్ రావుతో పాటు బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ ఇతర నేతలు గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

## ఆ రైతుది ఆత్మహత్య కాదు.. ప్రభుత్వ హత్యే: హరీష్ రావు




హైదరాబాద్, డిసెంబర్ 1: కౌలు రైతుల రైతు భరోసాకు సంబంధించి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. కౌలు రైతుల బతుకులకు భరోసా లేకుండా చేస్తోందంటూ రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. ఖమ్మం జిల్లాలో రైతు వీరన్న ఆత్మహత్యపై రియాక్ట్ అయిన మాజీ మంత్రి.. రైతు వీరన్న ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. రైతుది ఆత్మహత్య కాదని.. ప్రభుత్వ హత్యే అంటూ మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**హరీష్ ట్వీట్..** 'కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామని చెప్పి, నేడు వారి బతుకులకు భరోసా లేకుండా చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో కౌలు రైతు బానోతు వీరన్న ఆత్మహత్య అత్యంత బాధాకరం. పురుగుల మందు తాగుతూ.. పండించిన పంటకు ధర రాక, అప్పులు తీర్చే దారిలేక చనిపోతున్నా అని వీరన్న తీసుకున్న సెల్ఫీ వీడియో కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి చేసిన మోసాలకు నిదర్శనం. వీరన్నది ఆత్మహత్య కాదు, ప్రభుత్వం చేసిన హత్యనే. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయని ఫలితంగా బతుకులు భారమై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందు కౌలు రైతులకు ఏడాదికి రూ. 15,000 రైతుభరోసా ఇస్తామని బాండ్లు రాసిచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక మోసం చేయడం దుర్మార్గం. పండించిన పంటను కొనే దిక్కులేక, మద్దతు ధర రాక, దళారుల దోపిడీకి రైతులు బలవుతున్నారు. సెల్ఫీ వీడియోలో వీరన్న చెప్పిన మాటలకైనా ఈ ప్రభుత్వానికి చలనం వస్తుందా? ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులకు ఎప్పుడు రైతు భరోసా ఇస్తారు? మీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇంకెంత మంది రైతులను బలి తీసుకుంటారు? రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా పర్యటనలో కౌలు రైతు బానోతు వీరన్న కుటుంబాన్ని పరామర్శించాలని, ఆ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. రైతులెవరూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని చేతులు జోడించి విన్నవిస్తున్నాం. కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా పోరాటం చేద్దాం.. మీకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుంది. వచ్చేది కేసీఆర్ గారి ప్రభుత్వమే.. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయి... ఎవరూ అధైర్యపడకండి' అంటూ మాజీ మంత్రి హరీష్ రావు ట్వీట్ చేశారు.

# సంపాదకీయం

## ఆ దేశ నోట్లపై భారత భూభాగ చిహ్నాలు.. రెచ్చగొట్టేందుకేనా?

భారత్, నేపాల్ మధ్య స్నేహ సంబంధాలు ఉన్నప్పటికీ, సరిహద్దు గొడవలు అప్పుడప్పుడు రాజుకుంటూనే ఉంటాయి. ఇన్నాళ్లు కేవలం మాటల యుద్ధంగా, రాజకీయ మ్యాపులకే పరిమితమైన ఈ వివాదం ఇప్పుడు ప్రజల జేబుల్లోకి కూడా వచ్చేసింది. నేపాల్ తీసుకున్న తాజా నిర్ణయం రెండు దేశాల మధ్య దౌత్యపరమైన వేడిని పెంచేలా ఉంది. ఒక చిన్న కాగితం ముక్క ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. సాధారణంగా ఏ దేశమైనా తమ కరెన్సీ నోట్ల మీద వారి దేశ గొప్పతనాన్ని లేదా చిహ్నాలను ముద్రిస్తుంది. కానీ నేపాల్ మాత్రం ఒక అడుగు ముందుకేసి, ఇండియాకు చెందిన ప్రాంతాలను తమవిగా చూపిస్తూ కొత్త కరెన్సీని రిలీజ్ చేసింది. ఇది పక్కాగా ఇండియాను ఇరిటేట్ చేసే చర్యే అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆ నోటు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**కొత్త రూ. 100 నోట్లపై భారత చిహ్నాలు..** అసలు విషయానికి వస్తే.. నేపాల్ ప్రభుత్వం కొత్తగా 100 రూపాయల నోట్లను విడుదల చేసింది. ఇందులో ముద్రించిన నేపాల్ మ్యాప్ లో భారత భూభాగాలైన కాలాపానీ, లిపులేఖ్, లింపియాధురా ప్రాంతాలను తమ దేశంలో భాగంగా చూపించింది. నేపాల్ రాష్ట్ర బ్యాంక్ (NRB) ఈ కొత్త నోట్లను చలామణిలోకి తెచ్చింది. ఇందులో మాజీ గవర్నర్ మహా ప్రసాద్ అధికారి సంతకం, జారీ చేసిన తేదీ కూడా ఉంది. ఈ వివాదం ఈనాటిది కాదు. 2020, మే నెలలో కేపీ శర్మ ఓలి ప్రభుత్వం ఉన్నప్పుడే ఈ మూడు ప్రాంతాలను కలుపుకొని కొత్త రాజకీయ మ్యాప్ ఆమోదించింది. ఇప్పుడు దాన్ని అధికారికంగా కరెన్సీపై ముద్రించింది. విచిత్రం ఏంటంటే.. రూ. 10, 50, 500 వంటి నోట్లు ఉన్నా, కేవలం రూ. 100 నోటు మీద మాత్రమే నేపాల్ మ్యాప్ ఉంటుంది. అందుకే ఈ మార్పు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది.

**నేపాల్ నిర్ణయంపై భారత్ ఆగ్రహం..** దీనిపై భారత్ తీవ్రంగా స్పందించింది. నేపాల్ ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్ణయం వాస్తవాలను మార్చలేదని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ గతంలోనే చెప్పారు. నోటు మీద మ్యాప్ మార్చినంత మాత్రాన, గ్రౌండ్ లెవల్ లో ఇండియా భూభాగం నేపాల్ ది అయిపోదు కదా అని భారత్ గట్టి కౌంటర్ ఇచ్చింది. సరిహద్దు చర్చలు జరుగుతుండగా ఇలాంటి పనులు చేయడం సరికాదని భారత్ వాదన. సిక్కిం, బెంగాల్, బిహార్, యూపీ, ఉత్తరాఖండ్ రాష్ట్రాలతో కలుపుకొని దాదాపు 1,850 కిలోమీటర్ల మేర భారత్ నేపాల్ సరిహద్దు ఉంది. ఇలాంటి సున్నితమైన సమయంలో నేపాల్ చేసిన ఈ 'కరెన్సీ రాజకీయం' భవిష్యత్తులో రెండు దేశాల బంధంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాలి. ప్రస్తుతానికి అయితే ఆ కొత్త నోటు సరిహద్దుల్లో కొత్త చిచ్చు రేపేలా ఉంది.

**నేపాల్ అంతర్గత రాజకీయాల్లో సంచలనం...** ఈ చర్య నేపాల్ అంతర్గత రాజకీయాల్లో కూడా ఒక పెద్ద సంచలనం రేపింది. కొందరు అక్కడి నాయకులు దేశీయ జాతీయతను రెచ్చగొట్టేందుకు ఈ నోటు విడుదలను ఉపయోగించుకుంటున్నారని విశ్లేషకుల అభిప్రాయం. సరిహద్దు సమస్యలు పరిష్కారం దిశగా వెళ్లకుండా, వాటిని మరింత క్లిష్టం చేసే రాజకీయ ప్రయోజనాలకే ఈ చర్య దోహదం చేస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక భారత వైపు నుంచి చూస్తే, ఇది కేవలం సరిహద్దు వివాదం కాదు ఒక నిర్ధారిత అంతర్జాతీయ సరిహద్దు పట్ల పొరుగు దేశం తీసుకున్న అవాంఛిత ధోరణి. కరెన్సీ మీద మ్యాప్ ముద్రించడం అంతర్జాతీయ న్యాయపరంగా అర్థరహితం అయినప్పటికీ, పాపులర్ మైండ్‌సెట్‌ను ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. అందుకే భారత్ ఇకపై దౌత్యపరమైన పద్ధతులతోనే కాక, స్థానిక స్థాయిలో కూడా స్పందనను బలోపేతం చేసే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు.

- కొక్కు రవికుమార్

## రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల పట్ల తీవ్రమైన నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోంది

### టీయూడబ్ల్యూజే కుత్బుల్లాపూర్ అధ్యక్షులు గోలిపల్లి దయాకర్ రెడ్డి




కుత్బుల్లాపూర్, డిసెంబర్ 01 : రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పట్ల తీవ్రమైన నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోందని టీయూడబ్ల్యూజే కుత్బుల్లాపూర్ అధ్యక్షులు గోలిపల్లి దయాకర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూ డబ్ల్యూజే) ఆధ్వర్యంలో డిసెంబర్ 3వ తేదీన హైదరాబాద్‌లోని మాసాబ్ ట్యాంక్ వద్ద ఉన్న సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం ముందు భారీ ధర్నా నేపథ్యంలో సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ లో ఏర్పాటు చేసిన ధర్నా పోస్టర్ ఆవిష్కరణకు ఆయనతో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిబాబా, ప్రధాన కార్యదర్శి రెడ్డెబోయిన మల్లేష్ యాదవ్, సలహాదారులు గుంటూరు శేఖర్ తో కలిసి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా జర్నలిస్టుల జీవితాలు ఏ మాత్రం మెరుగుపడలేదని ఆరోపించారు. జర్నలిస్టుల ప్రధాన డిమాండ్లలో అక్రిడిటేషన్ పాలసీని వెంటనే ప్రకటించి కొత్త కార్డులు జారీ చేయడం, ఆరోగ్య బీమా పథకాన్ని పునరుద్ధరించడం, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం, వృత్తి కమిటీలను ఏర్పాటు చేయడం, సంక్షోభంలో ఉన్న చిన్న, మధ్యతరగతి పత్రికలను ఆదుకోవడం వంటివి ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని వారు విమర్శించారు. ప్రభుత్వ వైఖరి పట్ల తీవ్ర అసంతృప్తి నెలకొనడంతో, ఇటీవల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగాలని నిర్ణయించాలు ఈ ఆందోళన కార్యక్రమంలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొని తమ డిమాండ్లను సాధించుకోవాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణతో పాటు యూనియన్ సభ్యుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరుగు తుందన్నారు. పెద్ద ఎత్తున జర్నలిస్టులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి శర్మ, వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు కలికి మూర్తి, పత్రాల సురేష్ గౌడ్, జర్నలిస్టులు సీహెచ్ శ్రీనివాస్ రెడ్డి,యండి.లియాఖత్ అలీ, జనార్ధన్ రెడ్డి, ప్రవీణ్, సైదులు, సంతోష్, రాజిరెడ్డి, సంతోష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, నాగబాబు, నవీన్, అన్వార్, కృష్ణ గౌడ్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కవిత వర్సెస్ వేముల ప్రశాంత్ రెడ్డి

### అనుచరుల మధ్య బహిరంగ విమర్శలు





నిజామాబాద్ డిసెంబర్ 1 ( ప్రజాగళం ప్రతినిధి) కల్వకుంట్ల కవిత మాజీ మంత్రి బాల్కొండ శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి ల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఆ ఇద్దరి నేతల అనుచరులు బహిరంగ విమర్శలకు దిగుతున్నారు. గతంలో సన్నిహితంగా ఉన్న నాయకులు ప్రస్తుతం ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఒకే పార్టీలో కొనసాగిన వారు ఇలా విమర్శల అస్త్రాన్ని సంధించుకోవడం అది కూడా పత్రికా ముఖంగా పరస్పర ఆరోపణలు రాజకీయ దుమారానికి పరాకాష్టగా మారింది. జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, బీఆర్ఎస్ పార్టీ నుండి బహిష్కరణకు గురైన తర్వాత ఆ పార్టీ కీలక నేతలపై ఆరోపణలు గుప్పిస్తూ పార్టీ శాశ్వత సభ్యత్వానికి రాజీనామా చేశారు. అదేవిధంగా శాసన మండలి సభ్యత్వానికి రాజీనామా సమర్పించిన ఇప్పటికీ కవిత రాజీనామా ఆమోదించబడలేదు. దీంతో కొత్త పార్టీ దిశగా అడుగులు వేస్తున్న కవిత జనం బాట పేరిట జిల్లాల వారిగా పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా కామారెడ్డి జిల్లాలో కవిత చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారానికి దారితీశాయి. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిన ప్రాజెక్టుల ద్వారా కామారెడ్డి ప్రజలకు చుక్కనీరు అందలేదని చేసిన ఆరోపణలు మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి అనుచరులను అగ్రహానికి గురిచేశాయి. ఈ తరుణంలోనే మాజీమంత్రి బాల్కొండ శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి అనుచరులు ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవితపై చేసిన ఆరోపణలు జాగృతిని అగ్రహానికి గురిచేసింది. దీంతో వెంటనే స్పందించిన జాగృతి నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి వేముల ప్రశాంత్ రెడ్డి మంత్రిగా చేసిన అరాచకాలపై సమావేశంలో బహిరంగంగా విమర్శించారు. జాగృతి పై దుమ్మెత్తి పోస్తే మా తడాఖా చూపిస్తామంటూ ప్రశాంత్ రెడ్డి తో పాటు ఆయన అనుచరులకు ఘాటుగా హెచ్చరిక జారీ చేశారు. దీంతో కవిత, ప్రశాంత్ రెడ్డి అనుచరు ల మధ్య పరస్పర ఆరోపణలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

### ఒలింపిక్స్ కు ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యంగా సన్నద్ధం కావాలి

### విద్యార్థులకు ప్రేరణ కల్పించిన కలెక్టర్.

నిజామాబాద్ బ్యూరో డిసెంబర్ 01 ( ప్రజా గళం)ఒలింపిక్స్ క్రీడా పోటీలలో ప్రాతినిధ్యం దక్కేలా స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి విద్యార్థిని, విద్యార్థులకు ఉద్బోధించారు. అంకిత భావంతో కఠోర సాధన చేస్తే ఒలింపిక్స్ లక్ష్యం సాధించవచ్చని ప్రేరణ కల్పించారు. జక్రాన్పల్లి మండలం పడకల్ గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న పలువురు విద్యార్థిని, విద్యార్థులు వాలీబాల్ క్రీడలో జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని ప్రతిభను చాటడం, పూర్వ విద్యార్థులు స్పోర్ట్స్ కోటాలో వివిధ శాఖలలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విషయాలను గమనించిన కలెక్టర్, విద్యార్థులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. క్రీడల్లో రాణించడం వల్ల సమకూరే ప్రయోజనాల గురించి వారికి సవివరంగా తెలియజేశారు. విద్య, ఉద్యోగావకాశాల్లో ప్రత్యేక రిజర్వేషన్ తో పాటు, ఎంతో పేరు, ప్రఖ్యాతులు వస్తాయన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకే పరిమితం కాకుండా ఒలింపిక్స్ క్రీడలలో పాల్గొనే స్థాయికి చేరుకునేలా నిరంతర సాధన ద్వారా ప్రతిభను మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఒకే పాఠశాల నుండి వంద మందికి పైగా జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలలో పాల్గొనే అవకాశం లభించడం గొప్ప విషయమని, గ్రామాభివృద్ధి కమిటీ తనవంతు తోడ్పాటును అందిస్తుండడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు మరింత పట్టుదలతో కృషి చేస్తే ఒలింపిక్స్ స్థాయికి చేరడం కష్టమేమీ కాదన్నారు. ఈ దిశగా స్పష్టమైన ప్రణాళికను రూపొందించుకుని విద్యార్థులకు నాణ్యమైన తర్ఫీదును అందించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి వ్యాయామ ఉపాధ్యాయుడు, వాలీబాల్ కోచ్ శ్రీనివాస్ ను ఆదేశించారు. ప్రస్తుతం జాతీయ స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులను అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక అయ్యేలా సన్నద్ధం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై, చేయాల్సిన కృషి గురించి సమగ్ర అధ్యయనం చేసి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని సూచించారు. క్రీడల్లో ఆసక్తి కనబర్చే విద్యార్థిని, విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో విద్యార్థులు సాధించిన పతకాలు, మెమొంటోలు, ట్రోఫీలను కలెక్టర్ పరిశీలించి, క్రీడాకారులను, కోచ్ ను అభినందించారు. అంతకుముందు పాఠశాలలో విద్యార్థులు కోసం వండిన మధ్యాహ్న భోజనం నాణ్యతను కలెక్టర్ తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, సరుకుల నాణ్యత విషయంలో రాజీ పడకూడని, వంట గ్యాస్ పైనే భోజనం వండాలని సూచించారు. పాఠశాలలో మిషన్ భగీరథ మంచినీటి వసతి, బాలబాలికలకు వేర్వేరు టాయిలెట్స్, గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు తదితర వసతులను పరిశీలించారు. కిచెన్ గార్డెన్ నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక అధికారులు ఉన్నారు.

## జిల్లాలో రోడ్డు భద్రతకు పోలీసుల కీలక చర్య

### బాన్సువాడ లో నూతన ట్రాఫిక్ విధానం ప్రారంభం

బాన్సువాడ, డిసెంబర్ 1, ప్రజాగళం జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణ భద్రతను కాపాడే దిశగా జిల్లా పోలీసు శాఖ మరో కీలక ముందడుగు వేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా బాన్సువాడ పట్టణంలో నూతనం గా ప్రత్యేక ట్రాఫిక్ వ్యవస్థను ప్రారంభించారు.జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు బాన్సువాడలో ఒక ట్రాఫిక్ ఎస్సై, నలుగురు కానిస్టేబుళ్లతో ట్రాఫిక్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ కొత్త వ్యవస్థ మొత్తం టౌన్ ఎస్హెచ్ఓ శ్రీధర్ కుమార్ పర్యవేక్షణలో పనిచేయనుంది.ప్రజలు సురక్షి తంగా ప్రయాణించేలా ట్రాఫిక్ సిబ్బంది పట్టణంలోని ప్రధాన రహదారులపై నిరంతరం పర్య వేక్షణ చేపడతారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూనే, ప్రమాదాలను నివారించేందుకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు.ఈ సంద ర్భంగా జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర మాట్లాడుతూ"ప్రతి ప్రాణం విలువైనదే. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా మీ కుటుంబాన్ని, మీరు రక్షించు కోవచ్చు. బాన్సువాడలో కొత్త ట్రాఫిక్ వ్యవస్థ ప్రమాదాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది" అని తెలిపారు.ప్రజలందరూ రోడ్డు భద్రత నియ మాలను పాటిస్తూ, ప్రమాదాలు రాకుండా ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని ఎస్పీ పిలుపునిచ్చారు."మీ క్రమశిక్షణే మీ భద్రత రోడ్డు నియమాలు పాటించండి, సురక్షితంగా ఇంటికి చేరండి" అని సందేశం ఇచ్చారు.



## ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

### కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు




కుత్బుల్లాపూర్, డిసెంబర్ 01 : ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు అన్నారు. సోమవారం ఆయా సర్కిళ్ల పరిధిలోని నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి ఫిర్యాదులు అందాయని తెలిపారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో 7 ఫిర్యాదులు అందాయి. ఇంజినీరింగ్ 2, టౌన్ ప్లానింగ్ 3, రెవెన్యూ విభాగంలో 2 ఫిర్యాదులు అందాయ న్నారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో 11 ఫిర్యాదులు అందాయి. అందుల్లో టౌన్ ప్లానింగ్ 3, ఇంజనీరింగ్ 5, ఎలక్ట్రికల్ 3 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలొ వివిధ విభాగాలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జైతాపూర్ లో గ్రామ దేవతలకు భక్తి శ్రద్ధలతో బోనాలు...

ఎడపల్లి,నవంబర్ 30: (ప్రజా గళం)ఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామంలో భక్తి శ్రద్ధలతో బోనాల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో మహాలక్ష్మి మందిరం ప్రథమ వార్షికోత్సవ, ఎల్లమ్మ మందిరం ఐదేళ్ల వార్షికోత్సవం పూర్తి చేసుకున్న సందర్భ గ్రామంలో బోనాల పండగ నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని పోచమ్మ,ముత్యాలమ్మ, పెద్దమ్మ,ఎల్లమ్మ, మహలక్ష్మి దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించు కున్నారు .ఈ సందర్భంగా గ్రామంలో డప్పు వాయిద్యా లతో మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకువెల్లి గ్రామ దేవతలకు సమర్పించారు.గ్రామ జంతుబలులి చ్చి మొక్కులు తీర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాభివృద్ధికి యువ నాయకుడు మొహమ్మద్ గౌస్ ఆదర్శం


బాన్సువాడ డిసెంబర్ 1 ప్రజాగళం.బాన్సువాడ పట్టణంలో విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసులబాలరా జు ఆకాంక్ష వ్యక్తం చేస్తున్న నేప థ్యంలో, 13వ వార్డ్ టీచర్స్ కాలనీకి చెందిన యువ నాయకుడు మొహమ్మద్ గౌస్ సేవా కార్యక్రమం అందరి దృష్టిని ఆకర్షించింది.బాన్సువాడలోని ప్రొఫెసర్



జయశంకర్ సార్ మినీ స్టేడియంలో స్థానిక క్రీడాకారులకు వాలీబాల్ క్రీడా సామాగ్రిని మొహమ్మద్ గౌస్ అందజేశారు. క్రీడల ద్వారా బాన్సువాడ పేరు జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టత సంతరించుకోవాలని ఆశిస్తున్నట్టు గౌస్ తెలిపారు.ఈ సందర్భంగా క్రీడాకారులు మొహమ్మద్ గౌస్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మొహమ్మద్ దావూద్ పాల్గొన్నారు.

## శ్రీకాంతచారి 16వ వర్ధంతి సందర్భంగా చలో ఎల్బీ నగర్

బాన్సువాడ, డిసెంబరు1 పప్రజా గళం.తెలంగాణ కోసం ప్రాణాలను అర్పించిన మొట్టమొదటి అమరుడైన శ్రీకాంతచారి 16వ వర్ధంతి సందర్భంగా నిర్వహించే కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుండి ఉద్యమకారులు తరలిరావాలని టి యు ఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 3, 2025 (బుధవారం) ఉదయం 8:30 గంటలకు హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌లో అమరవీరుడు శ్రీకాంతచారి విగ్రహానికి



నివాళులు అర్పించేందుకు ప్రతి ఒక్క ఉద్యమకారుడు హాజరవాల్సిందిగా %TUF% కామారెడ్డి జిల్లా అధ్యక్షు లు ఉడుత గంగాధర్ గుప్త, బాన్స్‌వాడ మండల అధ్యక్షులు గంజివార్ చందుపిలుపునిచ్చారు.నివాళుల అనంతరం జరిగే సభలో ,కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై ఒత్తిడి చేయడం, తెలంగాణ ఉద్యమకారుల ఆశయాలను నెరవేర్చే దిశగానిర్ణయాలుతీసుకోవడంముఖ్యఅంశాలుగా ఉండనున్నాయని నిర్వాహ కులు తెలిపారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరు కానున్నారనీ తెలిపారు. మళ్లీ దశకు చేరిన ఉద్యమ ఉత్సాహాన్ని ప్రతిబిం బించేలా పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలన్నారు..

# జర్నలిస్టుల సమస్యలను, తక్షణమే పరిష్కరించాలి

**అడ్వర్టయిజ్మెంట్ల బకాయిలను చెల్లించాలి**

**జాప్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన..**

**టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య**

**సమాచార భవన్ ఎదుట జర్నలిస్టుల భారీ ధర్నా**




హైదరాబాద్, ప్రజాగళం డిసెంబర్ 01 : జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్టులు సోమవారం హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార శాఖ కమీషనరేట్ (సమాచారభవన్) ఎదుట ధర్నా నిర్వహించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలకు చెంది వందలాది మంది జర్నలిస్టులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని జర్నలిస్టులు ముక్తకంఠంతో నిరసించారు.సమస్యలను పరిష్కరించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ మామిడి సోమయ్య ధర్నానుద్దేశించి మాట్లాడుతూ,రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు కావస్తున్నా... జర్నలిస్టుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కరించలేదని, కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదని అన్నారు. జర్నలిస్టులకు ఇస్తామన్న ఇళ్లస్థలాల ఊసే లేదని, కోర్టు తీర్పు సాకుతో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని అన్నారు. ఆరోగ్య భీమా పథకాన్ని అటకెక్కించారని, చిన్న మధ్య తరహా పత్రికలను సంక్షోభంలో పడేసారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు. జర్నలిస్టులకు గత ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందంటే... అంతకంటే ఎక్కువగా ఈ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని అన్నారు.

జర్నలిస్టుల సమస్యలను త్వరగా పరిష్కరిస్తామంటూ ముఖ్యమంత్రి, సమాచార శాఖ మంత్రి పలు మార్లు హామీలిచ్చారే తప్ప ఆచరణలో పెట్టలేదని, చివరికి జర్నలిస్టుల ప్రతినిధిగా ఉన్న మీడియా అకాడమీ ఛైర్మన్ కూడా కమిటీల పేరుతో కాలయాపన చేసి చివరికి చేతులెత్తేశారని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వడం లేదని, ఇది చాలా అన్యాయమని, ప్రత్యామ్నాయ జీవో ద్వారా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.జర్నలిస్టుల సమస్యలలో ప్రధానమైన ఇండ్ల స్థలాలు, అక్రెడిటేషన్ కార్డులు,హెల్త్ కార్డులతో పాటు జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ళలో ఉచిత విద్య, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్, మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, చనిపోయిన జర్నలిస్టు కుటుంబానికి ప్రభుత్వం ఇస్తున్న లక్ష రూపాయల సహాయాన్ని రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.

చిన్న పత్రికలను ఎంపానెల్ లో చేర్చాలని, అడ్వర్టయిజ్మెంట్ పెంటింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని మామిడి సోమయ్య కోరారు. ఈ ధర్నాలో ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కో-కన్వీనర్లు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్, బండి విజయ్ కుమార్, తన్నీరు శ్రీనివాస్, ఆర్.వెంకటే శ్వర్లు, కుడుతాడి బాపురావు, ఎం.యాదగిరి, కె.పాండురంగారావు, వివిధ జిల్లాల నాయకులు కంతేటి రమాదేవి, పద్మనాభరావు, ఉదయ్ భాస్కర్ రెడ్డి, గిరిబాబు,అక్బర్ పాషా, పంతాటి రవీందర్, పి.గోపాల్, ఎం.గోపాల్, జక్కుల విజయకుమార్, స్వామిదాస్, మిట్టపల్లి మధు, మిద్దెల సత్యనారాయణ, శ్రీనివాస్ గౌడ్, పర్వతాలు, నీల నరేష్ , మల్లేష్, అశోక్,శంకర్, డప్పు రామస్వామి, శాంతి, సౌభాగ్యవతి, సుష్మ, మంజులారెడ్డి, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమాచార పౌరసంబధాల శాఖ కమీషనర్ కు ఇచ్చే వినతి పత్రాన్ని జాయింట్ డైరెక్టర్ డీ ఎస్ జగన్ కు అందజేశారు. జర్నలిస్టుల సమస్యల ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానని జగన్ హామీ ఇచ్చారు..

# క్షత్రియ పాఠశాలలో గీతా జయంతి వేడుకలు



ఆర్మూర్ డిసెంబర్ 01 (ప్రజా గళం) పట్టణంలోని క్షత్రియ స్కూల్ నందు గీతాజయంతి వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించరు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ నవిత, జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు శ్లోక పఠనం గావించి అర్ధ వివరణ చేసినారు. ఈ సందర్భంగా వర్చ్యువల్ గా పాల్గొన్న విద్యా సంస్థల చైర్మన్ శ్రీ అల్జాపూర్ శ్రీనివాస్, మాట్లాడుతూ ఉన్నతవిద్య, పరిపూర్ణ వ్యక్తిత్వం అనే లక్ష్య సాధన కోసం ప్రారంభించబడిన మా పాఠశాలలో భగవద్గీతను ఒక పాఠ్యాంశం గా చేసి భోదింప చేస్తున్నామని అన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ నవిత, మాట్లాడుతూ భగవద్గీత సందేశం ఒక్క అర్జునుని కోసం కాకుండా సమస్త మానవాళికి వర్తిస్తుందని పేర్కొన్నారు. మార్గశిర మాసం శుక్ల ఏకాదశి రోజున కురుక్షేత్రంలో శ్రీ కృష్ణుడు అర్జునునితో ప్రస్తావించిన అంశాలే భగవద్గీత అని, సనాతన ధర్మంలో జయంతిని జరుపుకొనే ఒకే ఒక గ్రంథం భగవద్గీత అని, అర్జునునికి కర్తవ్య బోధన గావించి విశ్వానికి ధర్మ సందేశం అందించిన గొప్ప గ్రంథం భగవద్గీత అని, విద్యార్థులందు జ్ఞానంతో పాటుగా దైవభక్తిని పెంపొదించుకొని, సంస్కారవంతులు కావాలని ఆకాక్షించినారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

**ఒలింపిక్స్ కు ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యంగా సన్నద్ధం కావాలి**

**విద్యార్థులకు ప్రేరణ కల్పించిన కలెక్టర్**





నిజామాబాద్ బ్యూరో డిసెంబర్ 01 ( ప్రజా గళం)ఒలింపిక్స్ క్రీడా పోటీలలో ప్రాతినిధ్యం దక్కేలా స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ప్రణాళికాబద్దంగా కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి విద్యార్థిని, విద్యార్థులకు ఉద్బోధించారు. అంకిత భావంతో కఠోర సాధన చేస్తే ఒలింపిక్స్ లక్ష్యం సాధించవచ్చని ప్రేరణ కల్పించారు. జక్రాన్పల్లి మండలం పడకల్ గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న పలువురు విద్యార్థిని, విద్యార్థులు వాలీబాల్ క్రీడలో జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని ప్రతిభను చాటడం, పూర్వ విద్యార్థులు స్పోర్ట్స్ కోటాలో వివిధ శాఖలలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విషయాలను గమనించిన కలెక్టర్, విద్యార్థులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. క్రీడల్లో రాణించడం వల్ల సమకూరే ప్రయోజనాల గురించి వారికి సవివరంగా తెలియజేశారు. విద్య, ఉద్యోగావకాశాల్లో ప్రత్యేక రిజర్వేషన్ తో పాటు, ఎంతో పేరు, ప్రఖ్యాతులు వస్తాయన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకే పరిమితం కాకుండా ఒలింపిక్స్ క్రీడలలో పాల్గొనే స్థాయికి చేరుకునేలా నిరంతర సాధన ద్వారా ప్రతిభను మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఒకే పాఠశాల నుండి వంద మందికి పైగా జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలలో పాల్గొనే అవకాశం లభించడం గొప్ప విషయమని, గ్రామాభివృద్ధి కమిటీ తనవంతు తోడ్పాటును అందిస్తుండడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు మరింత పట్టుదలతో కృషి చేస్తే ఒలింపిక్స్ స్థాయికి చేరడం కష్టమేమీ కాదన్నారు. ఈ దిశగా స్పష్టమైన ప్రణాళికను రూపొందించుకుని విద్యార్థులకు నాణ్యమైన తర్ఫీదును అందించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి వ్యాయామ ఉపాధ్యాయుడు, వాలీబాల్ కోచ్ శ్రీనివాస్ ను ఆదేశించారు. ప్రస్తుతం జాతీయ స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులను అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక అయ్యేలా సన్నద్ధం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై, చేయాల్సిన కృషి గురించి సమగ్ర అధ్యయనం చేసి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని సూచించారు. క్రీడల్లో ఆసక్తి కనబర్చే విద్యార్థిని, విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో విద్యార్థులు సాధించిన పతకాలు, మెమొంటోలు, ట్రోఫీలను కలెక్టర్ పరిశీలించి, క్రీడాకారులను, కోచ్ ను అభినందించారు. అంతకుముందు పాఠశాలలో విద్యార్థులు కోసం వండిన మధ్యాహ్న భోజనం నాణ్యతను కలెక్టర్ తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, సరుకుల నాణ్యత విషయంలో రాజీ పడకూడని, వంట గ్యాస్ పైనే భోజనం వండాలని సూచించారు. పాఠశాలలో మిషన్ భగీరథ మంచినీటి వసతి, బాలబాలికలకు వేర్వేరు టాయిలెట్స్, గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు తదితర వసతులను పరిశీలించారు. కిచెన్ గార్డెన్ నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక అధికారులు ఉన్నారు.

# నామినేషన్ల స్వీకరణలో పొరపాట్లకు తావు ఉండకూడదు

**కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి.**





నిజామాబాద్ డిసెంబర్ 01 (ప్రజాగళం ప్రతినిధి) నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. గ్రామ పంచాయతీ రెండవ విడత ఎన్నికలకు సంబంధించి నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాలతో పాటు జక్రాన్పల్లి మండలంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సోమవారం మోపాల్ మండలం కులాస్ పూర్, జక్రాన్పల్లి మండలం పడకల్ గ్రామ పంచాయతీల ఆకస్మికంగా సందర్శించారు. నామినేషన్ల స్వీకరణ తీరును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, మొదటి అంకమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని అన్నారు. నామినేషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు.

రెండవ విడత నామినేషన్ల ప్రక్రియ ఆదివారం ప్రారంభమైందని, మూడు రోజుల పాటు నామినేషన్లు స్వీకరిస్తారని అన్నారు. చివరి రోజున ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నందున, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. చివరి సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే నామినేషన్ తిరస్కరణకు గురవుతుందని, అందుకని అభ్యర్థులు ముందు జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలని సూచించారు. ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

# కవితపై దుష్ప్రచారాలు చేస్తే బాల్కొండ దాటనివ్వం

**-జాగృతి నాయకుల హెచ్చరిక**




నిజామాబాద్, డిసెంబర్ 01( ప్రజాగళం ప్రతినిధి)కవితపై దుష్ప్రచారాలు చేస్తే బాల్కొండ దాటనివ్వమని తెలంగాణ జాగృతి నాయకులు మాజీమంత్రి ప్రశాంత్ రెడ్డి ని హెచ్చరించారు.సోమవారం నగరంలోని ప్రెస్ క్లబ్ లో నిజామాబాద్ జిల్లా తెలంగాణ జాగృతి నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో తెలంగాణ జాగృతి రైతు విభాగ రాష్ట్ర అధ్యక్షులు నవీన్ రెడ్డి మాట్లాడుతూ ఆదివారం బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ నిజామాబాద్, కామారెడ్డి లో కాళేశ్వరం నీళ్లు రాలేదు అంటే మీ తండ్రి కేసీఆర్ ను అన్నట్టు కాదా అని విమర్శించిన ప్రశాంత్ రెడ్డి అనుచరుల మాటలను ఖండించారు.కేసీఆర్ నిజామాబాద్ జిల్లాకు నీళ్లు ఇవ్వాలనే కాళేశ్వరం ప్రాజెక్టులో 20, 21, 21ఏ, 22 ప్యాకేజీలను తలపెట్టారు.. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు నీటి భరోసా కోసమే ఎస్ ఆర్ ఎస్పీ పునరుజ్జీవం ప్రాజెక్టును తలపెట్టారు.. ప్రజలకు మంచి చేయాలనే లక్ష్యంతో ఆయన తలపెట్టిన ఈ ప్రాజెక్టులను కొందరు ధనార్జన కోసం ఉపయోగించుకున్నారు అన్నది నిజాం కాదా అని ప్రశ్నించారు.రూ.1,067 కోట్ల ప్రారంభించిన ఎస్ ఆర్ఎస్పీ పునరుజ్జీవం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం నాలుగేళ్లలోనే రెట్టింపు ఎందుకయ్యింది? దీనివెనుక ఉన్నది మీ నాయకుడు కదా,ఎస్సారెస్పీ పునరుజ్జీవం ప్రాజెక్టులోని మూడు పంపుహౌస్ ల ఎలక్ట్రో మెకానికల్, హైడ్రో మెకానికల్ పనుల వ్యయం రూ.600 కోట్ల నుంచి రూ.1,400 కోట్లకు పెరగడానికి కారకులెవరు మీ నాయకుడు కాదా అని అన్నారు. ప్రపంచంలోనే అతి పెద్దదైనా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాళేశ్వరం కట్టి కాళేశ్వరం నీళ్లను నిజామాబాద్ జిల్లా ఎస్ ఆర్ ఎస్ పి ప్రాజెక్ట్ లోకి, కామారెడ్డి జిల్లా నిజాం సాగర్ లోకి తీసుకొచ్చింది కేసీఆరే కదా? అటువంటి కేసీఆర్ ను అయన బిడ్డవై ఉండి కేసీఆర్ నీళ్లు తెలేదు అని అంటుంటే మీ నాయకుడు ప్రశాంత్ రెడ్డి ఎందుకు ఊరుకున్నాడు అని ప్రశ్నించారు.నిజాంసాగర్ లోకి కొండాపోచమ్మ నీటిని హల్దీ వాగు ద్వారా తరలించి 2021 యాసంగి పంటలకు నీటిని ఇచ్చారని మేము కూడా చెప్పామన్నారు..ఆ తర్వాత సంవత్సరాల్లో భారీ వర్షాలు కురవడంతో మళ్లీ ఎప్పుడూ ఆ అవసరం రాలేదని కూడా వివరించామన్నారు.కాళేశ్వరం నిర్మించడంలో కేసీఆర్ సంకల్పాన్ని కవిత ఎక్కడా తక్కువ చేసి మాట్లాడలేదన్నారు.తొమ్మిదిన్నరేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నతర్వాత కూడా పనులు పూర్తికాక నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు సాగునీరు రాలేదు అన్న రైతుల ఆవేదనను మాత్రమే ఎత్తి చూపించారన్నారు.నిజాంసాగర్ ను నింపాము.ఎస్ ఆర్ ఎస్ పీని కాళేశ్వరం నీళ్లతో నింపాము అని ప్రశాంత్ రెడ్డి అబద్ధాలు, అసత్యాలు చెప్పారన్నారు. కావాలనుకుంటే ఆయన విడుదల చేసిన ప్రెస్ నోట్ ను మరోసారి చదువుకోవాలని సూచించారు.నిజాంసాగర్ లోకి కొద్దిపాటి నీటిని కొండపోచమ్మ సాగర్ ద్వారా, పోచంపాడు డ్యాంలోకి 2.50 టీఎంసీలను ఎస్ ఆర్ఎస్పీ పునరుజ్జీవం ద్వారా ఎత్తిపోశారన్నారు..నిజాంసాగర్ కు ఇచ్చిన నీటితో ఆ ప్రాజెక్టు ఆయకట్టుకైనా కొంత భరోసా దక్కిందని,శ్రీరాంసాగర్ లోకి రివర్స్ పంపింగ్ ద్వారా తరలించిన నీరు ఉపయోగపడకపోగా ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో నదిలోకి వృథాగా పోయాయన్నారు.కరెంట్ బిల్లు నష్టం తప్ప సాధించింది ఏమీ లేదు.శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పునరుజ్జీవం తెస్తామని చెప్పి నాలుగేళ్ల వ్యవధిలో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రెట్టింపు చేసి ప్రజాధనం దోచుకుంటే దోపిడీని ప్రశ్నించొద్దా? కవితక్క ఎప్పుడూ మంచిని మంచి అనిచెడును చెడు అనే అంటారన్నారు.కాళేశ్వరం ద్వారా నీళ్లు వచ్చి ఆ ప్రాజెక్టు ఆయకట్టు సాకులోకి వచ్చి ఉంటే అదే విషయాన్ని చెప్పేవారు కదా బిఆరెస్ నాయకులు మాట్లాడుతూ ప్యాకేజ్ 21 పైప్ లైన్ ద్వారా కాళేశ్వరం నీళ్లు తీసుకొచ్చి నిజామాబాద్ జిల్లాలోని కప్పలవాగు పెద్దవాగులో పారియ్యడం భీంగల్ ప్రాంత రైతులందరు కండ్లతో చూసినారు పూజలు చేసినరు. ఇది కూడా టివిల్లలో వార్త పత్రికల్లో వచ్చింది వాస్తవం కాదా? అని అడిగారు. సబ్జెక్ట్ లేకుండా ప్రెస్ మీట్లో మీ అనుచరులతో మాట్లాడిస్తే నిజాలు కావు కాళేశ్వరం ప్యాకేజీ 21కి నేరుగా మేడిగడ్డ నుంచి నీళ్లు రావు అనే వాస్తవాన్ని గుర్తిస్తే మంచిదన్నారు..ఎస్ఆర్ఎస్పీ నీటినే ప్యాకేజీ 20 ద్వారా తరలించి ప్యాకేజీ 21 పైపులైన్ ద్వారా కప్పలవాగులోకి ఒకే ఒక్కరోజు ఎత్తిపోశారని ఏద్దేవా చేశారు.బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే ఈ ఎత్తిపోతల ట్రయల్ రన్ నిర్వహించారన్నారు.దీనితో ఎంత ఆయకట్టు సాకులోకి వచ్చింది? బాల్కొండ నియోజకవర్గంలో కాళేశ్వరం ఆయకట్టు 71,262 ఎకరాలు.. ఇందులో ఎన్ని ఎకరాలు సాగులోకి వచ్చాయి? అని చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ మీడియా సమావేశంలో నిజామాబాద్ తెలంగాణ జాగృతి అధ్యక్షులు అవంతి కుమార్,బోధన్ నియోజకవర్గ తెలంగాణ జాగృతి నాయకులు ప్రవీణ్ కుమార్, తెలంగాణ జాగృతి నాయకులు కరిపే రాజు , మీసాల శంకర్, అంబటి శ్రీనివాస్ , శేఖర్ రాజ్, ఎండల ప్రసాద్, జనార్దన్, సాయికృష్ణ , ఆజాం, షాన్వాజ్, హరీష్, సందీప్, ఆకాష్ , వంశీ మరియు తెలంగాణ జాగృతి మహిళా నాయకులు శోభ ,సరిత ,రేఖ తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడ్డ వారిని కాంగ్రెస్ పార్టీ తప్పక గుర్తిస్తుంది

**-రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్**

**-పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్**

**-జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుని ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న అగ్రనాయకులు**



నిజామాబాద్, డిసెంబర్ 01(ప్రజాగళం ప్రతినిధి)కష్టపడ్డ వారిని కాంగ్రెస్ పార్టీ తప్పక గుర్తిస్తుందని పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.నూతనంగా నియామితులైన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ లు సోమవారం కాంగ్రెస్ భవన్ లో బాధ్యతలు తీసుకున్నారు.అనంతరం లక్ష్మీ కళ్యాణ మండపంలో ప్రమాణ స్వీకార సభ ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా పీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ,రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ ,రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ,,రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి ,వివిధ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ లు,జిల్లా చైర్మన్లు,నియోజకవర్గ బాధ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు లభించడం ఎంతో అపూర్వ అవకాశామన్నారు. పార్టీకి కష్టపడ్డ వారికి పదవులు తప్పకుండా వస్తాయన్నారు.పదవులు ఆశించి రాని వాళ్ళకుభవిష్యత్తులో మంచి అవకాశం కల్పిస్తామన్నారు.పార్టీ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారు పార్టీ సిద్ధాంతాలను, విలువలను, ఆశయాలను గౌరవిస్తూ, జిల్లాలో, పట్టణంలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. జిల్లాలోని ప్రతి కార్యకర్తను కలుపుకొని పోతు. వారి సలహాలు, సూచనలు తీసుకుంటాను. పార్టీని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయాలని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలన్నారు.అందరినీ కలుపుకొని అందరి సహకారంతో కాంగ్రెస్ పార్టీని జిల్లాలో మరింత ముందుకు తీసుకువెళ్లాలి ఎల్లవేళలా మా సహకారం మీకు ఉంటుందాన్నారు.ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశ వేణు, ఎన్డీసీసీబీ బ్యాంకు చైర్మన్ రమేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# అతివలు రయ్...రయ్

పెద్దపల్లి : పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలు వాహన డ్రైవింగ్‌పైనా ఆసక్తి చూపుతున్నారు. ద్విచక్ర, కార్లు నడపడానికి వీలుగా శిక్షణ కేంద్రాల బాట పడుతున్నారు. ఇష్టంతో శిక్షణ పొంది సొంతంగా వాహనాలను రోడ్లపై పరుగు తీయిస్తూ పనులు చేసుకుంటున్నారు.

**ఏటా లైసెన్సుల పెరుగుదల**

జిల్లాలో 9 లక్షల జనాభా ఉంది. వీరిలో సగానికిపైగా మహిళలు ఉన్నారు. ప్రైవేటు ఉద్యోగాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. రామగుండం, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పట్టణాల్లో డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల్లో మెలకువలు నేర్చుకుంటున్నారు. రవాణాశాఖ నివేదిక ఆధారంగా వాహనాల లైసెన్స్‌లు తీసుకోవడంతో మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారు. మూడేళ్ల గణంకాలు పరిశీలిస్తే ఈ సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. జిల్లాలో సుమారు 15 శాతం లైసెన్సులు మహిళలు పొందుతున్నారు.

**ఆత్మవిశ్వాసం పెరిగింది**

నా భర్త ప్రభుత్వ ఉద్యోగి. ప్రతీ సమయంలో అందుబాటులో ఉండటం కొద్దిగా కష్టం. అత్యవసర పరిస్థితుల్లో ఇతరులపై ఆధారపడకుండా డ్రైవింగ్‌లో శిక్షణ పొందుతున్నా. దీంతో కారులో వెళ్లి నా కొడుకును పాఠశాల నుంచి తీసుకురావచ్చు. ఈ శిక్షణతో నాలో మరింత ఆత్మ విశ్వాసం పెరిగింది. – కళావతి

# ఎన్నాళ్లకెన్నేళ్లకు.. దేవుని సేవకు..

ఖమ్మం : దేవతామూర్తులకు శాస్త్ర, సంప్రదాయ సేవలు మరింతగా అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ, ధర్మాదాయశాఖ పరిధిలోని దేవాలయాల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయించింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అనేక ఏళ్ల తర్వాత దేవాలయాల్లో రెగ్యులర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. తద్వారా ఎనిమిది దేవాలయాల్లోని 19 పోస్టులు భర్తీ కానున్నాయి.

**భర్తీకానున్న పోస్టులు**

దేవాలయాల్లో వేద పారాయణదారులు, అర్చకులు, పంచారిక(గర్భాలయం శుభ్రం చేసేవారు), పాచక(వంట వండేవారు), సహాయ పాచక, డోలు, సన్నాయి, శ్రుతి వాయిద్యకారుల పోస్టులను అధికారులు భర్తీ చేయనున్నారు. ఎర్రుపాలెం మండలం జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి, ఖమ్మం కాల్వొడ్డు శ్రీసత్యనారాయణ సహిత శ్రీవీరాంజనేయస్వామి, కూసుమంచి మండలం జీళ్లచెర్వు శ్రీవెంకటేశ్వరస్వామి, పెనుబల్లి శ్రీనీలాదీశ్వరస్వామి, వేంసూరు మండలం కందుకూరు శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, పాల్వంచ పెద్దమ్మ తల్లి గుడి, అశ్వారావుపేట మండలం వినాయకపురం శ్రీచిలకలగండి ముత్యాలమ్మ తల్లి, అన్నపురెడ్డిపల్లి మండలం శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లోని 19 ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధిత ఈఓలు నోటిఫికేషన్లు విడుదల చేశారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు.



**ఇవీ అర్హతలు..**

అభ్యర్థులు తెలంగాణకు చెందిన వారై ఉండాలి. 18 నుంచి 40ఏళ్ల వయస్సు కలిగినవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. నోటిఫికేషన్ విడుదల చేసిన నాటి నుంచి 20రోజుల పాటు సంబంధిత దేవాలయాల్లో ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత వాటిని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయానికి ఈఓలు పంపిస్తారు. దరఖాస్తులను సహాయ కమిషనర్ కార్యాలయంలో ఓ కమిటీ పరిశీలిస్తుంది. అక్కడి నుంచి దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి దరఖాస్తులు చేరుతాయి. ఆ తర్వాత నోటిఫికేషన్ విడుదల చేసి రాత, ప్రాక్టికల్ పరీక్షలతో పాటు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. 'ఆసక్తి కలిగిన అభ్యర్థులు 20 రోజుల్లోపు సంబంధిత దేవాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలి. ఉభయ జిల్లాల్లో ఆదాయం కలిగిన ఆలయాలు 86 ఉంటే, ఎనిమిదింటిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయనున్నాం' అని దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఎం.వీరాస్వామి కు తెలిపారు.

# వాటా.. ఆదాయ ఊట..!

అశ్వారావుపేట : ఆయిల్‌ఫెడ్‌లో ముడిచమురు, గింజలతో పాటు కెర్నల్ ఆయిల్ ద్వారా సమకూరే ఆదాయంలోనూ రైతులకు వాటా ఇవ్వాలనే రైతు సంఘాల డిమాండ్‌కు నూనెగింజల సంస్థ తొలిసారి సానుకూలంగా స్పందించింది. దీనిపై కేంద్రానికి లేఖ రాయాలని, అధ్యయనం చేయాలని నిర్ణయించింది. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఓఈఆర్ నిర్ణయ సమావేశంలో దీనిపై ప్రైవేటు పరిశ్రమలు తీవ్రస్థాయిలో వ్యతిరేకించినా రైతుసంఘాల ప్రతినిధులు పట్టుబట్టడంతో ఆయిల్‌ఫెడ్ స్పందించింది.

**అప్పారావుపేట పరిశ్రమలో రెండేళ్లుగా..**

ఆయిల్‌పాం గెలలను గానుగ ఆడిస్తే గింజలు వేరవుతాయి. ఖాళీగెలలు వేరుగా వస్తాయి. ఈ క్రమంలో ముడిచమురు తయారవుతుంది. గింజలను ప్రైవేటు పరిశ్రమలు కొనుగోలు చేస్తుంటాయి. అదే గింజల నుంచి ఆయిల్(కెర్నల్) తీసే విధానాన్ని దమ్మపేట మండలం అప్పారావుపేటలో టీజీ ఆయిల్‌ఫెడ్ రెండేళ్ల క్రితం ప్రారంభించింది. ప్రస్తుతం టన్ను ఆయిల్‌పాం గెలల ధర రూ.19,681 పలుకుతోంది. గానుగ ఆడగా వచ్చిన గింజల టన్ను ధర రూ.32వేలు ఉంది. గింజల నుంచి తయారయ్యే కెర్నల్ ఆయిల్ టన్ను ధర రూ.2.10లక్షలు పలుకుతోంది. అందుకే రైతులు కెర్నల్ ఆయిల్ ద్వారా సమకూరే ఆద్యాయంలోనూ వాటా కావాలని డిమాండ్ చేస్తున్నారు. గతేడాది 29వేల టన్నుల గింజలు గానుగ ఆడగా 5వేల టన్నుల కెర్నల్ ఆయిల్ వచ్చింది. ప్రస్తుతం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 30వేల మంది రైతులు సుమారు 1.20లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలు పెంచుతున్నారు.

**కెర్నల్ ఆయిల్ వినియోగం ఇలా..**

కెర్నల్ ఆయిల్‌ను కాస్మోటిక్స్, బేకరీ పదార్థాల్లో అత్యధికంగా వాడుతుంటారు. ఆహార పరిశ్రమలు, సబ్బులు, లోషన్లు, క్రీమ్‌లు, కొన్ని రకాల ఔషధాల తయారీలో వినియోగిస్తారు. దీనిని బయోఫ్యూయల్‌గానూ వాడతారు. అందుకే కెర్నల్ ఆయిల్‌కు డిమాండ్ అధికంగా ఉంటోంది. కెర్నల్ ఆయిల్ ద్వారా పొందే రాబడిలో రైతులకు వాటా ఇవ్వాలని ఆయిల్‌పాం రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్, రైతు సంఘాల ప్రతినిధులు మూడేళ్లుగా కోరుతున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, వ్యవసాయ, ఉద్యాన ప్రధాన కార్యదర్శి, టీజీ ఆయిల్‌ఫెడ్ ఎండీకి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు. దీనిపై కేంద్రానికి లేఖ రాయాలని, అధ్యయనం చేయాలని ఆయిల్‌ఫెడ్ నిర్ణయించటంతో ఆయిల్‌పాం రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# భగవద్గీత మానవాళికి మార్గదర్శి

## శ్రీ సరస్వతీ విద్యా మందిర్ లో ఘనంగా గీత జయంతి వేడుకలు



అర్మూర్ డిసెంబర్ 01 (ప్రజాగళం) పట్టణ కేంద్రం లోని టీచర్స్ కాలనీ లో గల శ్రీ సరస్వతీ విద్యా మందిర్ పాఠశాలలో ఘనంగా గీత జయంతి కార్యక్రమ నిర్వహణ చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల పూర్వ విద్యార్థి పృథ్వీరాజ్ పాల్గొని భగవద్గీత యొక్క విశిష్టతను పిల్లలకు తెలపడం జరిగినది. తను మాట్లాడుతూఓం పార్థాయ ప్రతిబోధితాం!! భగవతా నారాయణేనా స్వయమ్!!భగవద్గీత జన్మదినం. గీతామాత ప్రభవించిన రోజు. గీతా భగవానుని జయంతి. గీతా జయంతి ఈ రోజు. జగద్గురువు శ్రీకృష్ణ పరమాత్ముడు శ్వేత వాహనుడు అయిన అర్జునునికి గీతోపదేశం చేసిన రోజు ఈ గీతామృతాన్ని బాదరాయణుడు అయిన వేదవ్యాసుడు ప్రపంచానికి భగవద్గీత రూపం లో పంచు వేదంగా అందించిన పవిత్రమైన శుభదినం ఈ రోజు. అశేష జనావ ళికి ఆనందమైన పండుగ రోజు. ఈ భగవద్గీత హిందువులకు మాత్రమే ధర్మ గ్రంథం కాదు. సకల మతాలు అమోదించిన అతి పవిత్రమైన వేదసారం ఇది. దీనిని అందరూ ప్రతి నిత్యం పఠించడం వలన మన జీవన పరమార్థం తెలుస్తుంది. పారాయణం చేయడం వలన మన జీవితం పవిత్రం అవుతుంది. ఇహలోకంలో సౌఖ్యం పరలోకంలో మోక్షం లభిస్తుంది. పునర్జన్మ ఉండదు అని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో పాఠశాల మేనేజ్మెంట్ భానుతేజ్, ప్రిన్సిపల్ వినోద్ కుమార్, ప్రభంద కారిణి సభ్యులు, మాతాజీలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో క్రీడారంగానికి పెద్ద పీట

## -అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలను ప్రారంభించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



నిజామాబాద్ సిటీ, డిసెంబర్ 01( ప్రజాగళం)రాష్ట్రంలో క్రీడా రంగానికి పెద్దపీట వేస్తున్నామని పిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం నిజామాబాద్ అర్బన్ పరిధిలో నిర్వహిస్తున్న అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలను టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి అభివృద్ధి చెందేందుకు ఇలాంటి క్రీడోత్సవాలు ఎంతో సహాయపడతాయని పేర్కొన్నారు. శారీరక, మానసిక వికాసానికి క్రీడలు అత్యవసరమని, క్రమశిక్షణ, టీమ్‌వర్క్, పోటీతత్వం వంటి విలువలను పెంపొందిస్తాయని అన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయిలకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందిస్తోందని తెలిపారు. ప్రతి పాఠశాలలో క్రీడలను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులను ప్రోత్సహిస్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్‌సూర్యనారాయణ,నుడా ఛైర్మన్ కేశవేణు,రాంభూపాల్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, అర్బన్ పాఠశాలల పిఈటీ లు పాల్గొన్నారు.

# అప్పులకు వడ్డీలు.. అసంపూర్తి నిర్మాణాలు



ముస్తాబాద్ : గత ప్రభుత్వ హయాంలో నిర్మించుకున్న రెండు పడక గదుల ఇళ్లకు బిల్లులు రాక లబ్ధిదారులు అప్పుల్లో కూరుకుపోయారు. జిల్లాలోని గ్రామాల్లో సొంత స్థలం ఉండి.. ఇల్లు నిర్మించుకోవటానికి ముందుకు వచ్చేవారికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని అప్పటి సర్పంచులు నాటి మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌ను కోరారు. ఆయన అప్పటి జిల్లా కలెక్టర్‌కు ఆదేశించగా.. గ్రామసభలు నిర్వహించి సొంత స్థలం ఉన్న పేద, మధ్యతరగతి వారిని గుర్తించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారు అప్పులు తెచ్చి నిర్మాణాలు ప్రారంభించారు. దాదాపు 6 ఏళ్లు గడస్తుండగా.. వడ్డీలు పెరిగిపోతున్నాయి కానీ బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముస్తాబాద్, మద్దికుంట, మోహినికుంట, చిప్పలపల్లి, పోత్గల్, గూడెం, కొండాపూర్ గ్రామాలకు రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేశారు. దాదాపు 2018–19 సంవత్సరంలో నిర్మాణాలు ప్రారంభించారు. రూ.5 లక్షలు సరిపోవని మరో రూ.5లక్షలు పెంచితే బాగుంటుందని లబ్ధిదారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అది అంతలోనే ఆగిపోయింది.

**గ్రామాలవారీగా ఇలా..**

ఆవునూర్ గ్రామంలో 28 మంది లబ్ధిదారులు ప్రైవేటు ఫైనాన్స్‌లో రుణాలు తీసుకుని నిర్మాణాలు చేపట్టారు. ఒక బిల్లు కూడా మంజూరు కాలేదు. ఇంటి నిర్మాణం పూర్తికాక.. బిల్లు రాక.. ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు.

సేవాలాల్‌తండాలో 8 మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వారికి బిల్లులు వచ్చిన దాఖలాలులేవు.

తెర్లుమద్దిలో 17 మంది వరకు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించుకున్నారు. కొందరికి 1 నుంచి 3 బిల్లుల వరకు మాత్రమే వచ్చాయి.

వెంకట్రావుపల్లె 20 రెండు పడక గదుల ఇళ్లకు... ముగ్గురు లబ్ధిదారులు పనులు ప్రారంభించారు.

తుర్కపల్లె గ్రామంలో 24 మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. నలుగురికి అసలే బిల్లులు రాలేదన్నారు.

బందనకల్‌లో 12 మంది నిర్మాణాలు ప్రారంభించారు. పూర్తిస్థాయిలో బిల్లులు రాక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

మొర్రాయిపల్లెలో 7 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. బిల్లులు మంజూరైన దాఖలాలు లేవు.

చీకోడ్‌లో 48 ఇళ్లు మంజూరు కాగా.. ఒక్కరు నిర్మించుకోలేదు. అధికారులు ఎంబీ రికార్డు చేయాలి. దీనికి ఈవోటీ(ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్) అడుగుతున్నారంటూ లబ్ధిదారులు అంటున్నారు. ఈవోటీ ఇప్పించి బిల్లులు వచ్చేలా అధికారులను లబ్ధిదారులు వేడుకొంటున్నారు.

**రూ.15లక్షలు ఖర్చు.. ఒక్క బిల్లు రాలే**

ఇంటి నిర్మాణానికి ఇప్పటికే రూ.15లక్షల వరకు ఖర్చు అయింది. ఇంతవరకు ఒక్క బిల్లు రాలేదు. దీంతో అసంపూర్తిగానే మిగిలిపోయింది. బిల్లుల కోసం అప్పటి సర్పంచి వద్దకు, ప్రజావాణిలో పలుమార్లు వినతి పత్రం అందించాం. నేను బీడీలు చుట్టేదాన్ని.. అనారోగ్యంతో ఇప్పుడు చేయటం లేదు. భర్త కూలి. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి.

– ప్యారం సత్తవ్వ, ఆవునూర్

# లోతట్టు వారధి.. పాలకుల పట్టింపేది!



జగిత్యాల : జగిత్యాల గ్రామీణ మండలం అనంతారం వద్ద జాతీయ రహదారిపై లోలెవెల్ వంతెనతో వాహనదారులకు ఇబ్బందులు తీవ్రమయ్యాయి. ఏళ్ల తరబడి ఇదే సమస్య ఉన్నా పాలకులు పట్టించుకోవడం లేదు. జగిత్యాల–మంచిర్యాల మార్గంలో 63వ నృబరు జాతీయ రహదారిపై 60 ఏళ్ల కిందట నిర్మించిన లోతట్టు వంతెన శిథిలావస్థకు చేరింది. వారధికి ఇరువైపులా దిమ్మెలు వరద ధాటికి కొట్టుకుపోయాయి. రాత్రి వేళ వాహనాలు అదుపు తప్పి వాగులో పడిపోయే ప్రమాదం ఉంది.

**50 గ్రామాలకు ఇదే మార్గం**

వాస్తవానికి ఈ రహదారిపై వంతెన నిర్మించాల్సిన బాధ్యత జాతీయ రహదారి సంస్థదే. కాగా ఆర్మూర్ నుంచి జగ్దల్‌పూర్ వరకు గ్రీన్ కారిడార్ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో మార్గాన్ని పూర్తి మార్చారు. ఈ మేరకు జగిత్యాల మండలం పొలాస దాటిన తర్వాత అనంతారం పెద్దమ్మ గుడి సమీపం నుంచి యశ్వంతరావుపేట, మద్దునూరు మీదుగా రాయపట్నం చేరుకునేలా కొత్తగా రహదారి నిర్మించనున్నారు.

ఇందులో భాగంగా భూసేకరణ చేపట్టారు. త్వరలోనే గ్రీన్ కారిడార్ హైవే నిర్మాణం ప్రారంభం కానుండగా పాత మార్గంలోని వంతెనను జాతీయ రహదారి అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) పట్టించుకోవడం లేదు.

సమస్యను స్థానిక ఎంపీ ధర్మపురి అర్వింద్ దృష్టికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తీసుకెళ్లారు. కాగా ఎలాంటి ముందడుగు పడలేదు. వాస్తవానికి మార్గాన్ని మార్చి జాతీయ రహదారి నిర్మిస్తున్నా అనంతారం వద్ద పూర్తి స్థాయి వంతెన నిర్మించాల్సిందే.

జగిత్యాల నుంచి ధర్మపురి, బుగ్గారం తదితర మండలాల్లోని 50 గ్రామాలకు ఇదే మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది. జాతీయ రహదారి సంస్థ స్పందించని నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వమైనా నిధులు కేటాయించి వారధి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా జాతీయ రహదారి సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించగానే నిధులు కేటాయించి వంతెన నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# తెలంగాణ అమరుడు పోలీసు కిష్టయ్య వర్ధంతి

## ఘనంగా నివాళులర్పించిన పోచారం శ్రీనివాస రెడ్డి

బాన్సువాడ, డిసెంబర్ 1 ప్రజాగళం. తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించిన అమరుడైన పోలీసు కిష్టయ్య వర్ధంతిని పురస్కరించుకుని, ఆయన త్యాగస్ఫూర్తిని స్మరించుకునే కార్యక్రమం సోమవారం బాన్సువాడ పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుడు కిష్టయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి. కార్యక్ర మంలో మాజీ డీసీసీబీ ఛైర్మన్ శ్రీ పోచారం భాస్కర్ రెడ్డి పాల్గొని కిష్టయ్య తెలంగాణ కోసం పోరాడి న త్యాగం యువతకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావం కోసం



ప్రాణత్యాగం చేసిన వీరుల త్యాగాలు ఎల్లప్పుడు ప్రజలకు దిశానిర్దేశం చేస్తాయని నాయకులు అభిప్రాయపడ్డారు. బాన్సువాడ డివిజన్ ముదిరాజ్ సంఘం నాయకులు, బాన్సువాడ పట్టణంలోని వివిధ ప్రజాప్రతిని ధులు,కార్యకర్తలుహాజరయ్యారు. అమరుడు కిష్టయ్యకు నివాళుల ర్పించే సందర్భంగా స్థానికంగా పెద్ద సంఖ్యలో ప్రజలు కూడా పాల్గొన్నారు.

# జైతాపూర్ లో గ్రామ దేవతలకు భక్తి శ్రద్దలతో బోనాలు...

ఎడపల్లి,నవంబర్ 30: (ప్రజా గళం)ఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామంలో భక్తి శ్రద్దలతో బోనాల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో మహాలక్ష్మి మందిరం ప్రథమ వార్షికోత్సవ, ఎల్లమ్మ మందిరం ఐదేళ్ల వార్షికోత్సవం పూర్తి చేసుకున్న సందర్భ




గ్రామంలో బోనాల పండగ నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని పోచమ్మ,ముత్యాలమ్మ,పెద్దమ్మ, ఎల్లమ్మ, మహలక్ష్మి దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించు కున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో డప్పు వాయిద్యా లతో మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకువెల్లి గ్రామ దేవతలకు సమర్పించారు. గ్రామ జంతుబలులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పనికి వెళ్లొద్దు అన్నందుకు మనస్తాపం చెంది అశోక్ సాగర్ చెరువులో వ్యక్తి ఆత్మహత్య...ఎస్ఐ రమ వెల్లడి

ఎడపల్లి,డిసెంబర్ 1:(ప్రజా గళం)నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామ శివారులోని అశోక్ సాగర్ చెరువులో మహమ్మద్ యూసుఫ్(59)అనే వ్యక్తి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎడపల్లి ఎస్ఐ ముత్యాల రమ తెలిపిన వివరాలు ప్రకారం.. బోధన్ పట్టణంలోని అనీసా నగర్ కు చెందిన మహమ్మద్ యూసూఫ్ వంట మాస్టారుగా పని చేస్తాడు అని,నవంబర్ 30న మహమ్మద్ యూసుఫ్ నవీపేట గ్రామంలో ఒక శుభకార్యంకు వంట చేయ డానికి





వెళ్తున్నానని ఇంట్లో చెప్పాడు. ఈ వయసులో నీకు పని చేసే అవసరం ఏమొచ్చిందని తన కొడుకులు తండ్రి యుసూఫ్ తో వారించగా,తనను పనిచేయ నీయడంలేదని భావించి,జీవితంపై విరక్తితో క్షణికావేశంలో జాన్కంపేట్ శివారులో గల అశోక్ సాగర్ లో దూకి యూసుఫ్ ఆత్మహత్య చేసుకున్నాడు అని ఎస్ఐ రమ తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న సమాచారం తెలు సున్న మృతుడు కుమారుడు షేక్.జలీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుఎస్ఐ తెలిపారు.

# వ్యయం రూ.లక్షలు.. ఆయుష్షు గంటలు

కూసుమంచి : నిర్మించిన అంతర్గత సిమెంటు రహదారిని గంటల వ్యవధిలో జేసీబీతో ధ్వంసం చేశారు. కూసుమంచిలో ఉపాధిహామీ పథకం ద్వారా రూ.20.90 లక్షలతో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు మూడు రోజుల క్రితం అంతర్గత రహదారి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఓ కుటుంబంలో సభ్యుల మధ్య వివాదం నేపథ్యంలో న్యాయస్థానంలో తీర్పు కోసం వేచిఉన్న భూమిలో రహదారి నిర్మించారంటూ అధికారులకు ఓ వర్గం ఫిర్యాదు చేసింది. దీంతో రహదారిని తొలగించాలని అధికారులు నిర్ణయించారు. నిర్మించిన మార్గంలో 38మీటర్ల మేర జేసీబీతో తొలగించారు. నిర్మించే ముందు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదని పంచాయతీరాజ్ శాఖ ఏఈ రెయిన్‌హార్డ్ కు తెలిపారు.

# ప్రేమతో ఇంటిని రాసిస్తే.. తాతనే వెళ్లగొట్టాడు

హైదరాబాద్: ప్రేమతో ఇల్లు రాసిస్తే.. అది తన సొంతమయ్యాక తాతనే ఇంట్లోంచి వెళ్లగొట్టాడో మనవడు.. అపాత్రదానం చేశానని గ్రహించిన ఆ తాత..న్యాయపోరాటం చేసి బహుమతిని రద్దు చేయించుకున్నారు. దీంతో ఇల్లు ఖాళీ చేయించాలంటూ మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను ఆయన అభ్యర్థించారు. రెండు నెలల క్రితం జరిగిన ఈ సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. సి.రాములు అనే 91 ఏళ్ల విశ్రాంత ఉపాధ్యాయుడు పదవీ విరమణప్పుడు, ఇతర ఆదాయంతో కీసర మండలం కొత్తపేట్‌లో ఒక ఇల్లు కొనుగోలు చేశారు. ఎనిమిదేళ్ల క్రితం రాములు కుమారుడు చనిపోయారు. దీంతో ఆయన ఇంటిని పెద్ద మనవడు శ్రీనివాస్‌కు 2018లో గిఫ్ట్‌డీడ్‌గా ఇచ్చారు. బహుమతిగా ఇంటిని పొందిన కొద్దినెలలకే మనవడు శ్రీనివాస్.. తన తాతయ్య రాములు, తల్లి, సోదరుడిని ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. దీంతో ఆయన.. వృద్ధుల సంక్షేమ చట్టం-2007 ప్రకారం 2021లో మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. పలుమార్లు



విచారించిన అనంతరం జిల్లా కలెక్టర్ గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసింది. గిఫ్ట్‌డీడ్ రద్దుపై శ్రీనివాస్ హైకోర్టును ఆశ్రయించగా.. నాలుగేళ్లపాటు విచారించిన హైకోర్టు గిఫ్ట్‌డీడ్ రద్దు సబబేనంటూ రెండు నెలల క్రితం తీర్పు ప్రకటించింది.

**పోషించాలని ఎక్కడా లేదుగా..**

మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాలను రాములు మనవడు శ్రీనివాస్ పాటించలేదు. తనకు తన తాత బహుమతిగా ఇంటిని రాసిచ్చిన పత్రాల్లో ఎక్కడా 'తాతను పోషించాలి' అంటూ నిబంధన లేదంటూ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా జస్టిస్ పుల్లా కార్తిక్ ఇరువర్గాల వాదనలు విన్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పులను ఉటంకిస్తూ.. నిబంధన లేకపోయినా.. వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన శిక్షలు వేయడంతోపాటు బహుమతిని రద్దు చేసేందుకు ఆ కారణం సరిపోతుందని కొద్దిరోజుల క్రితం తీర్పు ప్రకటించారు. దీంతో అప్పటి కలెక్టర్ తీసుకున్న నిర్ణయం మేరకు ఇప్పుడు తనకు ఇల్లు ఇప్పించాలంటూ సి.రాములు మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను అభ్యర్థించారు.

# ఉచిత వైఫై వాడుతున్నారా?

హైదరాబాద్: నేటి డిజిటల్ యుగంలో అంతర్జాలం రోజువారీ అవసరంగా మారింది. వివిధ అవసరాల నిమిత్తం చాలామంది ఫ్రీ వైఫై వినియోగిస్తుంటారు. బస్టాండ్లు, షాపింగ్ మాల్స్, రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు.. ఇలా పబ్లిక్ ప్లేస్‌లో ఫ్రీ వైఫై వాడేటప్పుడు అప్రమత్తంగా లేకపోతే పబ్లిక్ వై-ఫై వాడే సమయంలో డేటా చోరీ, ఆర్థిక మోసం జరిగే ప్రమాదం ఉందని భారత ప్రభుత్వ సైబర్ భద్రతా సంస్థ హెచ్చరించింది.



**నష్టాలు ఇవే..**

భద్రతా లోపం..: పబ్లిక్ వైఫైలో తగినంత భద్రత ఉండదు. హ్యాకర్లు మనల్ని మోసం చేయడానికి నకిలీ వైఫై నెట్‌వర్క్‌లను రూపొందిస్తుంటారు.డేటా చోరీ..: పబ్లిక్ వైఫైకి కనెక్ట్ అయిన వెంటనే హ్యాకర్లు మీ ఫోన్ పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ అకౌంట్ వివరాలు, ఈ-మెయిల్స్ వంటి వాటిని సులభంగా అపహరించే ప్రమాదం ఎక్కువ.మీ ఫోన్‌లోకి వైరస్‌లను పంపి, సమాచారం సేకరించడం హ్యాకర్లకు చాలా సులభం. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే..: వీలైనంత వరకు పబ్లిక్ వైఫైని వాడకపోవడం ఉత్తమం. అత్యవసర పరిస్థితుల్లో వీపీఎన్ వాడటం ఉత్తమం. తద్వారా కొంత వరకు భద్రత లభిస్తుంది.

# విలీనమైతే లాభమా.. నష్టమా?

హైదరాబాద్: గ్రామాలను దగ్గర్లోని పురపాలికలు, నగరపాలక సంస్థల్లో కలిపేశారు. ఇప్పుడు ఆయా పట్టణ స్థానిక సంస్థ (యూఎల్‌బీ)లను తీసుకెళ్లి జీహెచ్ఎంసీలో విలీనం చేయబోతున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై.. విలీనం కానున్న స్థానిక సంస్థల పరిధిలోని ప్రజలు తీవ్రంగా చర్చించుకుంటున్నారు. ప్రయోజనాలు, నష్టాలపై విశ్లేషణలు చేసుకుంటున్నారు. సర్కారు తీసుకున్న విలీన నిర్ణయంపై మెజార్టీ ప్రజలు సానుకూలంగా ఉన్నప్పటికీ.. జనాల్లో పలు రకాల చర్చలు జరుగుతున్నాయి.

రకరకాల ప్రశ్నలు.. గ్రేటర్‌లో విలీనం చేస్తే ఆస్తిపన్ను పెరుగుతుందా, మేము చెల్లించే పన్నులను వేరే ప్రాంతాల్లో ఖర్చు చేస్తారా? అని జనాలు రకరకాల ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. మణికొండ, నార్సింగి నగరపాలక సంస్థలకు ఆస్తిపన్ను ద్వారా ఎక్కువ ఆదాయం సమకూరుతుంది. జవహర్‌నగర్, జల్‌పల్లి, తుక్కుగూడ వంటివి ఆదాయ వనరులు లేక అవస్థ పడుతున్నాయి. ఇప్పుడు అన్నింటినీ గ్రేటర్‌లో కలిపేస్తే.. నిధులను ఎలా ఖర్చు చేస్తారోనని చర్చించుకుంటున్నారు.

**ముందున్న సవాళ్లు..**

నగరానికి చేరువగా ఉన్నప్పటికీ.. విలీన ప్రాంతాల్లో వందలాది గ్రామాలు ఉన్నాయి. వాటిని నగర అభివృద్ధిలో భాగస్వామ్యం చేసేటప్పుడు.. గ్రామీణ వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుంది. విశాల నగరం అయినప్పటికీ.. జన సాంద్రత ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా ఉంది. మణికొండ, నార్సింగి ప్రాంతాల్లో జన సాంద్రత అధికం. పెద్దఅంబర్‌పేట్, ఘట్‌కేసర్, తుక్కుగూడ ప్రాంతాల్లో తక్కువ. వాటిని దృష్టిలో ఉంచుకుని.. అభివృద్ధి సమతూకంలో ఉండేట్టు అధికారులు జాగ్రత్త తీసుకోవాలి.

డివిజన్ల పునర్విభజన అనేక రాజకీయ, సామాజిక సవాళ్లను సృష్టిస్తుంది. వాటిని పరిష్కరించినప్పుడే.. ఎలాంటి దుమారం లేకుండా బృహత్‌నగర పరిపాలన గాడిలో పడుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# అమ్మబోతే కొర్రీలు.. కొన్నాక కోతలు



గంగాధర : ఈ చిత్రంలో పేరుకున్న ధాన్యం నిల్వలు గంగాధర మార్కెట్ యార్డులోని ప్యాక్స్ కేంద్రంలోనివి. సాధారణంగా బస్తాకు 40 కిలోలు, బస్తాకు కలుపుకొని 40.600 కిలలో చొప్పున తూకం వేయాలి. కానీ కొన్ని చోట్ల 42.250 కిలోలు, మరికొన్ని చోట్ల దీనికంటే అధికంగా తూకం వేస్తున్నారు. అలా అయితేనే దింపుకొంటామని రైస్‌మిల్లర్లు కొర్రీలు పెట్టడంతో నాలుగు రోజులుగా ధాన్యం తూకం నిలిపివేశారు. గంగాధర ప్యాక్స్ పరిధిలో ఆరు కేంద్రాలు, కురిక్యాల ప్యాక్స్ పరిధిలో 11 కేంద్రాల్లో రెండ్రోజులుగా కొనుగోళ్లు నిలిచిపోయాయి.వరి ధాన్యం పండించే శ్రమ కన్నా అమ్ముకోవడమే అన్నదాతకు కష్టంగా మారింది. యాసంగి పంటల సాగులో తలమునకలు కావాల్సిన వారు ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవడానికి అరిగోస పడుతున్నారు. జిల్లాలోని పలు కేంద్రాల నుంచి పంపిన ధాన్యం బస్తాలను మిల్లర్లు ఆలస్యంగా దింపుకొంటున్నారు. దీంతో తూకం వేసిన ధాన్యంలోనూ బరువు నష్టపోతున్నారు. మిల్లు యాజమాని తక్కువ బరువు ఉందని కోత విధించి కేంద్రం నిర్వాహకులకు ఫోన్లో సమాచారమిస్తున్నారు. ఈ విషయాన్ని కేంద్ర నిర్వాహకుడు రైతుకు తెలియజేయగా.. చేసేదేమిలేక ఒప్పుకుంటున్నారు.**సన్నాలు కావాలని.. వడ్లు నిండుకున్నాయని..**

జిల్లాలో 325 కేంద్రాల ద్వారా 32,390 రైతుల నుంచి 2,00,325 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 1,98,901 మె.ట తరలించారు. ఇంకా 1423 మె.ట ధాన్యం కేంద్రాల నుంచి తరలించాల్సి ఉంది. వాతావరణ పరిస్థితులు బాగుండీ, వడ్లు తేమ లేకుండా ఉన్నప్పటికీ తూకం వేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. సన్నాలు కావాలని, ఇప్పటికే దొడ్డు రకం ధాన్యంతో రైస్‌మిల్లుల్లో స్థలం లేదని మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. లేకపోతే 43.500 కిలోలు తూకం వేసి పంపిస్తేనే దింపుకొంటామని చెప్పడంతో చాలా కేంద్రాల్లో ధాన్యం తూకాలను నిలిపివేశారు.

**సమస్య మా దృష్టికి రాలేదు..**

సమస్య మా దృష్టికి రాలేదు. కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. ఏదైన సమస్య ఉంటే రైతులు మాకు చెప్పాలి.

- రజనీకాంత్, పౌరసరఫరాల శాఖ డీఎం

**చాలా ఇబ్బందిగా ఉంది**

లారీలు రావడంలేదని, సంచులు లేవని నాలుగు రోజులుగా కొనుగోళు నిలిపివేశారు. ధాన్యం ఆరబెట్టినా ఎక్కువ తూకం వేస్తామంటున్నారు. మార్కెట్‌లోంచి ధాన్యం తీసుకెళ్లి ప్రైవేటుకైనా అమ్ముకుంటాం.

- రుద్రాక్ష మంజుల, గంగాధర

**43 కిలోల పైగా తూకం**

15 రోజులుగా ధాన్యం అమ్ముకోవడానికి మార్కెట్‌కు వస్తున్నాం. 43 కిలోలపైగా తూకం వేస్తామంటున్నారు. పంట పండించడం కంటే కూలీ పనులకు వెళ్లడమే మంచిది.

- అమిరిశెట్టి రాజు, గంగాధర

# పాండవుల గుట్టపై కబ్జాదారుల కన్ను



కాల్వశ్రీరాంపూర్ : అక్రమార్కులు గుట్టలు, ప్రభుత్వ స్థలాల్లో ఇష్టారాజ్యంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. గుట్టలు మాయమైపోతుండగా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలంలో సుమారు 200 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో పాండవుల గుట్ట క్రమంగా తరిగిపోతోంది. ఈ గుట్ట ప్రాంతంలో పోలీస్ స్టేషన్, మార్కెట్‌యార్డు, జూనియర్ కళాశాల, కస్తూర్బా పాఠశాల, రెండు పడక గదుల నిర్మాణం, రైతు వేదిక, పల్లె ప్రకృతివనం, విద్యుత్తు ఉప కేంద్రం, శ్రీజగత్ మహామునీశ్వర స్వామి ఆలయానికి, అయ్యప్ప దేవాలయానికి కొంత భూమి కేటాయించారుఈ ప్రాంతమంతా అక్రమ పట్టాలతో కొందరు, మరి కొందరూ ఎలాంటి పట్టా లేకున్నా కబ్జా చేసి సాగు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

**పెద్దల అండదండలతో..**

వాస్తవంగా మట్టి తవ్వకాలు చేపట్టాలనుకునేవారు మొదట గనులశాఖకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలు సవ్యంగా ఉంటే ఎన్‌ఓసీ(నో అబ్జక్షన్ సర్టిఫికెట్) సంబంధిత తహసీల్దార్‌కు పంపుతారు. అనంతరం గనులశాఖ, రెవెన్యూశాఖ అధికారులు కలిసి ఒకేసారి నిర్ణీత మట్టి తవ్వకాల ప్రదేశాన్ని సర్వే చేయాలి. ఇవన్నీ ఉంటే మట్టి తవ్వకాలకు అనుమతించగా మట్టికి రాయల్టీ రూపంలో నిర్ణీత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఇవేమీ లేకుండా మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి.

**రాయల్టీకి గండి**

ట్రాక్టర్లు కాకుండా లారీల్లో మట్టిని గృహాలు, వేడుక వేదికలు, వెంచర్ల ప్రదేశాలకు చేరవేస్తున్నారు. ఇలా నిబంధనలు విస్మరించడంతో ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీకి గండి పడుతోంది.

ఈ విషయంపై తహసీల్దార్ జగదీశ్వర్‌రావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పాండవుల గుట్ట ప్రాంతాన్ని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటాం అని వివరించారు.

# మనసు పెట్టి.. పతకాలు కొట్టి



జగిత్యాల : 64 గడులపైనే మనసు కేంద్రీకరించి, నిర్దేశిత సమయంలో మెదడుకు పదును పెడితేనే చదరంగం ఆటలో విజయం వరిస్తుంది. అంతర్జాతీయ స్థాయికి ఎదగాలంటే కింది స్థాయి పోటీల నుంచే రాణించాలి. ఇటీవల జగిత్యాల పట్టణంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో స్విస్ లీగ్ విధానంలో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచి పలువురు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. చాటిన క్రీడాకారుల నేపథ్యంతో కథనం..

**ఒకటో తరగతి నుంచే ఆసక్తి**

కరీంనగర్‌కు చెందిన కుమ్మరి సాధన తండ్రి సంతోష్‌కుమార్ ఎల్‌ఐసీలో ఉద్యోగి, తల్లి షారా ప్రభుత్వ ఉపాధ్యాయిని. ఒకటో తరగతి నుంచే ఆటపై ఆసక్తి పెంచుకుంది. చరవాణి సాయంతో నైపుణ్యం పెంచుకుంటోంది. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయి రేటింగ్ 1416లో కొనసాగుతోంది. గతంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఏడేళ్లలోపు విభాగంలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. గతేడాది జాతీయ స్థాయి పోటీల్లో ఏడో స్థానంలో, రాష్ట్ర స్థాయిలో అయిదో స్థానంలో నిలిచింది. గ్రాండ్‌మాస్టర్ కావడమే లక్ష్యమని సాధన చెబుతోంది.

**గ్రాండ్‌మాస్టర్‌గా నిలవడమే ధ్యేయం**

కరీంనగర్‌కు చెందిన వేముల అభిరామ్ పదో తరగతి చదువుతున్నాడు. తండ్రి రామకృష్ణ ప్రభుత్వ అధ్యాపకుడు, తల్లి పావని గృహిణి. నాలుగేళ్లుగా నిత్యం రెండున్నర గంటల పాటు సాధన చేస్తున్నాడు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయి రేటింగ్ 1462తో కొనసాగుతున్నాడు. జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు సార్లు చొప్పున పాల్గొని ప్రతిభ చాటాడు. మార్వెల్ పోటీల్లో పతకం సొంతం చేసుకున్నాడు. ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా స్థిరపడటం, గ్రాండ్‌మాస్టర్‌గా నిలవడం జీవిత ధ్యేయమని పేర్కొన్నాడు.

**నిరంతర సాధనతో గుర్తింపు**

రంగారెడ్డి జిల్లాకు చెందిన గౌరికా ఎస్‌వీ పదో తరగతి చదువుతోంది. తండ్రి శివానంద్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కాగా, తల్లి శృతి బిహేవియర్ థెరపిస్ట్. ఏడాది కిందట రీజినల్ పోటీల్లో ప్రతిభతో గుర్తింపు పొందింది. నాటి నుంచి నిరంతర సాధనతో అంతర్జాతీయ స్థాయి రేటింగ్ 1480తో కొనసాగుతోంది. ఇప్పటివరకు ఐసీఎస్‌సీ జాతీయ స్థాయి పోటీల్లో రెండుసార్లు పాల్గొంది. జోనల్ స్థాయిలో బంగారు, రీజినల్ స్థాయిలో రజత పతకం సాధించిన గౌరికా గ్రాండ్‌మాస్టర్‌తో పాటు, వైద్యురాలిగా స్థిరపడటమే లక్ష్యమని చెబుతోంది.

# వాళ్లొస్తే డిగ్రీ.. వీళ్లొస్తే ఎంబీఏ

హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ కోర్సులకు అనుమతి పొందుతున్న కొన్ని ప్రైవేటు కళాశాలల యజమానులు ఒకే భవనంలో ప్రైవేటు వర్సిటీలు, ఇతర రాష్ట్రాల వర్సిటీల ఇంటిగ్రేటెడ్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఓయూ అనుబంధ గుర్తింపున్న కళాశాలల్లో ఇలా ఇతర వర్సిటీల తరగతులు బోధించకూడదు. రాంనగర్‌లో సన్ డిగ్రీ కళాశాల యాజమాన్యం దిల్లీలోని ఓ విశ్వవిద్యాలయంతో ఒప్పందం కుదుర్చుకుని విద్యార్థులకు ప్రవేశాలు కల్పించి తరగతులు నిర్వహిస్తోంది.ఓయూ ఆడిట్ విభాగం ఇటీవల తనిఖీలు నిర్వహించి సన్ డిగ్రీ కళాశాలకు రూ.8 లక్షల జరిమానా విధించింది. సన్ డిగ్రీ కళాశాలతో పాటు గ్రేటర్ పరిధిలోని మరికొన్ని ప్రైవేటు కళాశాలలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఓయూ అధికారులు వచ్చినప్పుడు ఆ భవనం డిగ్రీ కళాశాలగా మారిపోతుంది. ప్రైవేటు, ఇతర రాష్ట్రాల వర్సిటీల ప్రతినిధులు వెళ్లినప్పుడు ఎంబీఏ, ఎంసీఏ కళాశాల బోర్డు ఉంటుంది. ఈ అక్రమ వ్యవహారం ఇప్పటి వరకు గుట్టుగా సాగింది. ఓయూ అధికారులు కొందరు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అంతర్గతంగా సమాచారాన్ని సేకరిసున్నారు.



**ఎంబీఏ, ఎంసీఏలకు గుర్తింపు వర్తించకున్నా..** ఇతర రాష్ట్రాల వర్సిటీలతో ఒప్పందం కుదుర్చుకుంటున్న ప్రైవేటు కళాశాలల యజమానులు అదే భవనంలో ఎంబీఏ, ఎంసీఏ, ఇంటిగ్రేటెడ్ కోర్సులను నిర్వహిస్తున్నారు. రికార్డుల ప్రకారం ఆయా కోర్సులు చదువుకుంటున్న వారు ఓయూ పరిధిలోకి రారు. గ్రేటర్ హైదరాబాద్‌లో చదువుకుంటున్నా ప్రైవేటు, ఇతర రాష్ట్రాల్లో చదువుతున్నట్లు గానే వ్యవహరిస్తారు.

**కఠిన చర్యలు తీసుకుంటాం**

ఓయూ పరిధిలో కొన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలల భవనాల్లో ఇతర రాష్ట్రాల వర్సిటీలకు చెందిన ఎంబీఏ , ఇంటిగ్రేటెడ్ కాలేజీలు ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం.ఇకపై ఆకస్మిక తనిఖీలు చేస్తాం.

ఆచార్య కుమార్ మొలుగరం, ఉపకులపతి, ఓయూ

# బషీరాబాద్.. కన్నడిగుల జిందాబాద్

బషీరాబాద్ : రాష్ట్రం వేరైనా వర్తకం మాత్రం ఇక్కడికే అంటున్నారు.. కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రజలు. నిత్యం బషీరాబాద్ మండల కేంద్రానికి వచ్చి వివిధ పనులు చేసుకొని వెళతారు. నిజాం పాలనలో కలబురిగి (గుల్బర్గా) రాష్ట్రం ఉండగా.. బషీరాబాద్ జిల్లా కేంద్రం ఉండేది. అప్పటి నుంచే బషీరాబాద్‌లోనే అన్ని పనులు చేసుకోవడం అలవాటుగా మారిందని వివరిస్తున్నారు.

**ప్రసవాలు ఇక్కడే..**

బషీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతి రోజు స్థానిక రోగులతోపాటు కర్ణాటకకు చెందిన వారు సేవలు పొందుతున్నారు. ప్రాంతీయ భేదం లేకుండా సేవలు అందిస్తున్నామని వైద్యులు అంటున్నారు. రోజూ



80-100 మందిలో 25 మంది పొరుగు రాష్ట్రం రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. హల్కోడ, వెంకటాపూర్, పోతంగల్, జెట్టూరు, అయ్యాలం మహిళలు ప్రసవాలకు బషీరాబాద్‌కు వస్తున్నారు. ప్రతి మంగళవారం సంత రోజున బషీరాబాద్ నుంచి ఆయా గ్రామాలకు ప్రత్యేకంగా ఆటోలు, జీపులు నడిపిస్తారు. కూరగాయలు, నిత్యావసర వస్తువుల కొనుగోలుకు ప్రతిరోజు వందల సంఖ్యలో వస్తున్నారు.

**ఊరక్కడ.. భూములు ఇక్కడ**

జీవన్గీ, బషీరాబాద్, ఇందర్‌చేడ్, గంగ్వార్, క్యాద్గిర గ్రామాల పరిధిలో కర్ణాటక రైతులకు భూములున్నాయి. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ నుంచి అందించే రైతుబంధు, ఇతర పథకాలను సైతం కన్నడిగులు సద్వినియోగం చేసుకుంటున్నారు. వ్యవసాయ ఉత్పత్తులను బషీరాబాద్, తాండూరు విపణికి తీసుకొచ్చి విక్రయాలు చేస్తున్నారు.

# బాల్యంలో లగ్గం.. అధికారుల పగ్గం

తాండూరు :"మేళ తాళాల మధ్య మాంగల్యం తంతునానేనా అని పెళ్లి మంత్రం ఎక్కడి నుంచైనా వినిపిస్తే ఆహా ఎంత శుభకరం.. అని భావిస్తుంటాం. కానీ బాల్యం ముగియకుండానే వివాహాలు చేయడమనేది ఆరోగ్యపరంగా అశుభకరం." జిల్లాలోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ, ఛైల్డ్‌లైన్ బృందాలు బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన కట్టుదిట్టమైన నిఘా, గ్రామీణ స్థాయిలో కొనసాగుతున్న అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయి. నాలుగు సంవత్సరాల వ్యవధిలో ఏకంగా 430బాల్య వివాహాలను అడ్డుకోవడం విశేషం. గ్రామాల్లో వాలంటీర్లు, ఆశ కార్యకర్తలు, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు ఇస్తున్న సమాచారంతో అధికారులు వెంటనే స్పందించడంతో బాలల భవితకు బాటలు పడేందుకు తోడ్పడింది.

**అవగాహన సదస్సులతో..**

తాండూరు పట్టణాన్ని ఆనుకొని ఉన్న గ్రామానికి చెందిన బాలికతో మరో గ్రామానికి చెందిన యువకుడు ఇటీవల బాల్య వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేయగా.. ఐసీడీఎస్ అధికారులు వెళ్లి నిలువరించారు. బాలికను సఖీ కేంద్రానికి తరలించారు.ః చెంగోల్‌లో ఆరు బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేశారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, ఆరోగ్యపరమైన సమస్యలను తల్లిదండ్రులకు వివరించి పెళ్లి ఆలోచనను విరమింపజేశారు.

**చట్టం ప్రకారం శిక్షార్హం**

బాలికలు మేజర్ అయితే విద్య, ఉపాధి అవకాశాలపై స్పష్టత వస్తుంది. జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారు. ఈక్రమంలో బాల్య వివాహాలను గ్రామస్థాయిలో నిలువరించడానికి సమాచార నెట్‌వర్క్‌ను బలంగా ఏర్పాటు చేసుకున్నాం. అవగాహన సదస్సుల్లో అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, మహిళా సంఘాలు, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం యువజన సంఘాలు తోడ్పాటు అందిస్తున్నాయి. వధువుకు 18 ఏళ్లు, వరుడుకి 21 సంవత్సరాల వయస్సు నిండితేనే వివాహం జరిపించాలి.వెంకటేషం, బాలల సంక్షేమ కమిటీ జిల్లా ఛైర్‌పర్సన్

# 'బయో'త్పాతం!

హైదరాబాద్ : ఉస్మానియా, గాంధీ, నిలోఫర్ తదితర ఆసుపత్రుల్లో బయోవ్యర్థాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దవాఖానాలోని వ్యర్థాలను కుప్పగా పోసి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. బయో వ్యర్థాలు అందులో కలిసిపోతున్నాయి. పర్యావరణానికి ముప్పుగా మారుతున్నాయి. వ్యర్థాలను వేరు చేసి రంగుల డబ్బాల్లో వేయాలి. వాటి తరలింపు...ధ్వంసం చేయడంలో ప్రత్యేక పద్ధతులు అనుసరించాలి. రాత్రి వేళ సిబ్బంది అన్ని వ్యర్థాలను కుప్పగా వేస్తున్నారు. అవయవాలు, డ్రెస్సింగ్ మెటీరియల్, ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ ఒకేచోట కలిసిపోతున్నాయి.

రంగు డబ్బాలు: వ్యర్థాలు
పసుపు: రోగుల శరీర భాగాలు, డ్రెస్సింగ్ మెటీరియల్, ఔషధాలు
ఎరుపు: పునర్వినియోగ ప్లాస్టిక్ వ్యర్థాలు
నీలం: గాజు, లోహపు వ్యర్థాలు
తెలుపు: సూదులు, బ్లేడులు, షార్ప్ వస్తువులు

**నాలాల్లోకి మురుగు**

ఆసుపత్రుల్లో మురుగు శుద్ధి చేయకుండా నాలాల్లో కలుస్తోంది. అందులో రసాయన వ్యర్థాలు, ఔషధాలు, యాంటీబయోటిక్స్‌లాంటివి ఉంటున్నాయి. ఉస్మానియా, గాంధీలో వ్యర్థాల ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పనులు కొనసాగుతున్నాయి.

**ఇలా చేయాలి..**



సేకరించిన వ్యర్థాలను తరలించే వాహనం బయో వ్యర్థాలు అని తెలిపేలా ప్రత్యేకంగా రాసి పెట్టాలి.
వ్యర్థాలు తరలించే సమయంలో జారి పడిపోకుండా పరదాలు కప్పి ఉంచాలి. కుప్పగా ఉంచి.. ఏజెన్సీలకు అప్పగింత
ఆసుపత్రుల్లో వ్యర్థాలను కుప్పగా ఉంచి... తర్వాత ఏజెన్సీలకు అప్పగిస్తున్నారు. మిగతా వ్యర్థాలతో వాటిని కలిపి తరలించడం వల్ల ప్రమాదకర వైరస్‌లు పర్యావరణంలో కలిసే ప్రమాదం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# విషం చిమ్ముతున్నా.. నిర్లక్ష్యమే అడుగడుగునా

హైదరాబాద్: అనుమతి లేని ఎలక్ట్రోప్లేటింగ్, ఫినిషింగ్ పరిశ్రమలు నగరంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. రెడ్ కేటగిరీ (అత్యంత కాలుష్యం వెదజల్లే) విభాగంలో ఉన్న యూనిట్లు కాలుష్య నియంత్రణ విస్మరించడంతో బాలానగర్, మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో జల, వాయుకాలుష్యం పెరుగుతోంది. ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్స్, జ్యువెల్లరీ రంగాల్లో లోహ భాగాలపై పూత పూయడానికి క్రోమియం, నికెల్, జింక్, కాపర్‌ను ఉపయోగిస్తారు. ఈ ప్రక్రియలో వెలువడే వ్యర్థాలను శుద్ధి కేంద్రాలకు తరలించి వాయుఉద్గారాలను తగ్గించాలి. కానీ అనుమతి లేకుండా యూనిట్లు వెలుస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా కుషాయిగూడలో దక్కన్ మెటాగ్రాఫిక్స్, బాలానగర్‌లో ఇండియన్ ఎలక్ట్రోప్లేటర్స్ పరిశ్రమలు కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్ అనుమతులు తీసుకోకుండా కార్యకలాపాలు సాగిస్తున్న విషయం



వెలుగులోకి వచ్చింది.

**అనుమతి లేకుండా 100కి పైగా యూనిట్లు..**

గ్రేటర్ పరిధిలో 300కి పైగా ఎలక్ట్రోప్లేటింగ్, ఫినిషింగ్ యూనిట్లు ఉండగా అనుమతి లేకుండా నడిచేవి100కి పైనే ఉన్నాయి. నిబంధనల ప్రకారం కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్ అనుమతి తీసుకున్న పరిశ్రమలు ఐదేళ్లకోసారి రెన్యువల్ చేసుకోవాలి కానీ యథేచ్ఛగా కార్యకలాపాలు సాగిస్తున్నారు. వ్యర్థాల సేకరణకు ప్రతి యూనిట్‌లో 1000 లీటర్ల ట్యాంక్‌లను ఏర్పాటు చేసి అవి నిండేలోపే జీడిమెట్ల ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించాలి. ఇలా తరలించేందుకు రూ.10,000 వరకు ఖర్చవుతుందని కొందరు రోడ్లపైనే పారబోస్తున్నారు. బాలానగర్ పారిశ్రామికవాడలో ఇలాంటి పరిశ్రమలు అనేకం.

# గ్రామమంతా ఒకే మాట.. రెండే పంటలు



జమ్మికుంట : ఏ ఊరిలోనైనా అక్కడి నేలల రకాలు, వాతావరణ పరిస్థితులు, నీటి సౌకర్యాలు బట్టి వివిధ రకాల పంటలు సాగు చేస్తారు. అయితే జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామపంచా యతీ పరిధి కాపులపల్లె రైతులు 25 ఏళ్లుగా వానాకాలంలో పత్తి, ఎండకాలంలో మొక్కజొన్న పంటలు మాత్రమే వేస్తున్నారు. 500 ఎకరాల నల్లరేగడి భూములు, నీటి సౌకర్యంతో గ్రామంలోని 90 మందికిపైగా రైతులు ఒకే రకమైన పంటలు సాగు చేస్తున్నారు. వారి అనుభవాలకు తోడు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలతో మంచి దిగుబడులు సాధిస్తున్నారు. వానకాలం సీజన్‌లో గ్రామం మొదలు.. శివారు వరకు పత్తి క్షేత్రాలే దర్శనమిస్తాయి. రోహిణి కార్తె ప్రవేశం సమయంలోనే పత్తి సాగు చేపట్టి మూడు దఫాలుగా జమ్మికుంట మార్కెట్‌లో విక్రయిస్తారు. గతంలో ఎకరానికి 12 నుంచి 15 క్వింటాళ్ల పత్తిని పండించగా.. ప్రస్తుత పరిస్థితులతో 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఏఈవో మహేందర్, రైతులు చెప్పారు. జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్తలు ఇక్కడే క్షేత్రస్థాయిలో ఉత్తమ పత్తి యాజమాన్య పథకం ప్రాజెక్టు, పత్తి సాగుపై పరిసర, ఇతర జిల్లాల రైతులకు అవగాహన కల్పిస్తారు.

# స్మార్ట్ లైట్ల మాయ.. వెలగకముందే బిల్లుల రికార్డు



కరీంనగర్ : కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నగరాభివృద్ధి పనులు చేశారు. సిమెంటు రహదారులు నిర్మించిన చోట రోడ్డుకు ఇరువైపులా వీధిదీపాల కోసం ప్రత్యేక స్తంభాలు వేశారు. రాత్రి పూట లైట్లు వెలగాల్సి ఉండగా, ఏళ్ల తరబడి అంధకారం నెలకొంది. ఇదేమిటని గత పాలకవర్గ సభ్యులు అప్పట్లోనే ప్రశ్నించారు. విద్యుత్తు నియంత్రికలు, ప్రత్యేకంగా మీటర్ల కెపాసిటీ పెంచాలనే కారణాలతో దాటవేసే ధోరణి అవలంబించారు. కొన్ని ప్రాంతాల్లో వెలగకపోవడంతో స్మార్ట్ లైట్ల మాయలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి.

**అనేక చోట్ల అలంకారప్రాయంగా..**

స్మార్ట్‌సిటీ స్తంభాలకు వీధిదీపాలు అలంకారప్రాయంగా ఉన్నాయి. అశోక్‌నగర్, కాపువాడ రోడ్డు, మల్కాపూర్ రహదారి, భాగ్యనగర్, ఆదర్శనగర్ నుంచి కోర్టు రోడ్డు, గాంధీరోడ్డు, పోచమ్మవాడ తదితర ప్రాంతాల్లో కొన్ని స్తంభాలకు లైట్లు ఉండగా అవి వెలగడంలేదు. యజ్ఞవరాహస్వామి ఆలయం రోడ్డులో 25 స్తంభాలు ఉన్నాయి. అందులో ఒక్కటీ వెలగడం లేదు.

**దొరకని విడిభాగాలు**

స్మార్ట్ స్తంభాలకు ఎల్ఈడీ వీధిదీపాలు బిగించగా, వాటి విడిభాగాలు దొరకడం లేదు. నాణ్యత లేని లైట్లు బిగించారు. రెండేళ్ల నిర్వహణ మరిచారు. అంబేడ్కర్ స్టేడియంలో 24 వీధి దీపాలకు ఉన్న విడిభాగాలు దొంగలు ఎత్తుకెళ్లగా, కొత్తవి అమర్చేందుకు సిద్ధంకాగా, విడిభాగాలు ఎక్కడా దొరకడం లేదు. స్థానికంగా దొరకని, నాసిరకం లైట్లు, విడిభాగాలు పెట్టారనే ఆరోపణలున్నాయి. వీధిదీపాలు వెలగకపోవడం, ఏళ్ల తరబడి నిర్లక్ష్యంగా ఉంచారనే ఫిర్యాదులు వస్తుండటంతో తప్పని పరిస్థితిలో నగర పాలక సంస్థ చర్యలు చేపట్టింది. ఒక్కో రోడ్డులో వీటిని పరిశీలిస్తూ కేబుళ్లు కొనుగోలు చేస్తూ లైట్లకు మరమ్మతులు చేస్తున్నారు. కొన్ని చోట్ల కొత్తవి బిగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాంతో బల్దియాకు రూ.లక్షల్లో భారం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

**పరిశీలించకుండా.. హడావుడిగా..** స్మార్ట్‌సిటీ స్తంభాలకు సంబంధించిన వీధిదీపాలు వెలుగుతున్నాయా? లేవా? అనేవి కూడా గతంలో పని చేసిన ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించలేదు. ప్రస్తుతం వెలగడం లేదని క్షేత్రస్థాయికి వెళ్లి ఆరా తీస్తే విషయం తెలుసుకొని అవాక్కయ్యారు. స్తంభాలకు కేబుళ్లు వేయకుండానే వదిలేశారు. ఒక్కో స్తంభం మధ్యలో 40 మీటర్ల దూరం ఉంటుంది. మొత్తం స్తంభాలకు కేబుల్స్ వేసి లైట్లు వెలిగించిన తర్వాతే బిల్లులు రికార్డు చేయాల్సి ఉండగా, హడావుడిగా చేశారు. **తనిఖీ చేయిస్తాం: ప్రఫుల్ దేశాయ్, కమిషనర్, నగరపాలక సంస్థ** స్మార్ట్‌సిటీ లైట్లకు సంబంధించిన విషయాలపై ఇంజినీరింగ్ అధికారులతో తనిఖీ చేయిస్తాం. వీటికి సంబంధించిన దస్త్రాలు పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

# పుష్కరకాలం పూర్తి.. ఏదీ అభివృద్ధి?



మల్లాపూర్: వచ్చే గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ప్రభుత్వం అవసరమైన మేర అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉన్నా.. ఆ దిశగా దృష్టి సారించకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జరిగిన పుష్కరాల సమయాల్లో కొద్దినెలల ముందే హడావుడిగా పనులు మంజూరుచేసి ప్రారంభించినప్పటికి.. సకాలంలో అవి పూర్తికాక గతంలో భక్తులు తీవ్ర ఇబ్బందుల మధ్యే స్వామివారిని దర్శించుకొన్నారు. నేటికి కొన్నిచోట్ల పనులు నిర్మాణ దశలోనే ఉండటం గమనార్హం. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన వాల్గొండ రామలింగేశ్వరాలయంతోపాటు దేవాదాయశాఖ పరిధిలో ఉన్న వెంకట్రావుపేట గంగ గౌరీశ్వర దేవస్థానం పరిధిలోని గోదావరిలో స్నానాలు ఆచరించేందుకు మహారాష్ట్ర వంటి ప్రాంతాల నుంచి లక్షల్లో భక్తులు వస్తుంటారు.

**పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి**

ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతున్న వాల్గొండ రామలింగేశ్వరాలయం(త్రికూటలయం)ను జిల్లాలోనే ప్రముఖ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ఉమ్మడి ఏపీ ప్రభుత్వ హయాం నుంచి టూరిజంశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నా అవి బుట్టదాఖలే అవుతున్నాయి. వాల్గొండ గోదావరి ఒడ్డున రిసార్టులు నిర్మించడంతోపాటు నదిపై వంతెన నిర్మాణం చేపట్టి బోటింగ్ సైతం ఏర్పాటు చేసేందుకు ఈ ప్రాంతం అనువైందిగా ఎంపికచేసినా ముందడుగు పడలేదు. పుష్కరఘాట్‌లను విస్తరించడం, దుస్తులు మార్చుకునే గదులు, పారిశుద్ధ్యం నిర్వహణ వంటి పనులు చేయాల్సిఉంది.

**ఏకో టూరిజంపై నీలినీడలు**

వెంకట్రావుపేట గంగ గౌరీశ్వర ఆలయం ప్రకృతి రమణీయతతో ఉంటుంది. నది అందాలు, ప్రకృతి సెలయేళ్లు భక్తులను కనువిందు చేస్తున్నాయి. పూర్తిగా అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న రేవులో గౌరీశ్వర దేవస్థానం నిర్మాణానికి పదేళ్లు గడుస్తున్నా.. అడుగు ముందుకు పడటంలేదు. కేవలం స్లాబ్ వరకు పూర్తయిన అనంతరం పుష్కరాలు రావడంతో పనులు అక్కడే నిలిపివేసి భక్తులకు దర్శనం కల్పించారు. తర్వాత ఆలయ నిర్మాణాన్ని పట్టించుకోలేదు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ ప్రాంతాన్ని ఏకో టూరిజంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించినా అది కార్యరూపం దాల్చలేదు. వచ్చే పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతమున్న రహదారిని రెండు వరుసలుగా విస్తరించడం, విద్యుత్తు సౌకర్యం, దుస్తులు మార్చుకునే గదులను ఏర్పాటు చేయడంతోపాటు ఆలయ పనులు చేపట్టాల్సి ఉంది.

# అంగన్‌వాడీలకు మహర్దశ



జగిత్యాల : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలు ఇక తీరనున్నాయి. స్లాబు లీకేజీలు, కిటికీలు సక్రమంగా లేకపోవడం, వెలసిపోయిన గోడలకు సంబంధించి కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో మొత్తం 1065 కేంద్రాలుండగా.. వీటిలో సొంత భవనాలు 286, ఉచిత అద్దె భవనాలు 239, అద్దెకు సంబంధించి 540 ఉన్నాయి. వీటిలో గర్భిణులు, బాలింతలు, టీహెచ్‌ఆర్ తీసుకుంటున్న వారు, చిన్నారులు లబ్ధి పొందుతున్నారు.

**తొలగిన స్థానిక కోడ్ అడ్డంకి**

ప్రస్తుతం ఎన్నికల కోడ్ తొలగిపోవడంతో వెంటనే అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలోని సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నా పెద్ద మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. ఎలాంటి ఆటంకాలు ఏర్పడకూడదన్న ఉద్దేశంతో సమస్యలు పరిష్కరించేందుకు కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. గతంలో ఒక్కో కేంద్రానికి రూ.2 లక్షల చొప్పున మంజూరయ్యాయి.

**రూ.2.50 లక్షల చొప్పున**

ఒక్కో కేంద్రానికి రూ.2.50 లక్షల చొప్పున మరమ్మతుల కోసం 56 కేంద్రాలకు జిల్లా కలెక్టర్ మంజూరు చేశారు. ఈ పనులు పంచాయతీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అయితే సొంత భవనాలున్న మరో 30 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరమ్మతులు అవసరమని నివేదించగా, నిధుల మంజూరుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

**పర్యవేక్షణ తప్పనిసరి**

ప్రభుత్వం చేపట్టే పనులంటేనే ఒకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు. గతంలో మల్యాలలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో మరమ్మతులు చేపట్టిన రేకుల షెడ్డులో వర్షం నీరు లీకవడంతో నిర్వాహకులు, లబ్ధిదారులు అవస్థలు పడాల్సి వచ్చింది. ఇందులో నట్టు, బోల్ట్ సక్రమంగా బిగించకపోవడం కారణమని గుర్తించి సరిచేశారు. ఈ లెక్కన మరమ్మతు పనులకు ఎంపిక చేసిన అంగన్‌వాడీల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించాల్సిన అవసరముంది.

**సక్రమంగా జరిగేలా చూస్తాం**

జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేశారు. మధ్యలో ఎన్నికల కోడ్ రావడంతో అభివృద్ధి పనులకు కొంత ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం కోడ్ తొలగిపోవడంతో అభివృద్ధి చేసేందుకు మార్గం సుగమమైంది. త్వరలో మరమ్మతు పనులు మొదలవుతాయి. సక్రమంగా అభివృద్ధి జరిగేలా పర్యవేక్షిస్తాం. డా.నరేశ్, జిల్లా సంక్షేమాధికారి

# ప్రథమ చికిత్స పెట్టెలు.. కనిపించని మందులు

కరీంనగర్ : ప్రజా రవాణా వ్యవస్థ అనగానే గుర్తుకొచ్చేది ఆర్టీసీ. ఈ బస్సుల్లో నిత్యం లక్షలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కాగా ఇటీవల రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న వరుస ప్రమాదాలు ప్రయాణికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో చికిత్స అందించడానికి ప్రతీ బస్సులో అవసరమైన మందులతో కూడిన ప్రథమ చికిత్స పెట్టే తప్పనిసరిగా ఉండాలి. కానీ చాలా బస్సుల్లో అవి కనిపించడం లేదు.

జిల్లాలో హుజూరాబాద్, కరీంనగర్-1, 2 మూడు డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 322 బస్సులు ఉండగా ఇందులో ఆర్టీసీ 129, అద్దె బస్సులు 97, ఎలక్ట్రిక్ బస్సులు 96 వరకు ఉన్నాయి. వీటి ద్వారా నిత్యం వేలాది మంది ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు చేరవేస్తుంటాయి.

**ఖాళీగా దర్శనం**

నిబంధనల ప్రకారం బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టే తప్పనిసరిగా ఉండాలి. చాలా బస్సుల్లో నామమాత్రంగా ఉన్నాయి. అందులోనూ



ఎలాంటి మందులు, పరికరాలు లేవు. మరికొన్ని పెట్టెలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇంకొన్నింటిలో ఉపయోగించాల్సిన మందుల గడువు ముగిసి తీరాయి. వీటి నిర్వహణపై అధికారులు చేతులెత్తేశారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని బస్సుల్లో త్వరలో వివిధ రకాల మందులు, పరికరాలతో కూడిన ప్రథమ చికిత్స పెట్టెలను అందుబాటులో ఉంచేలా ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

**ఉండాల్సినవి..**

స్పిరిట్, డెటాల్, కాటన్, పేయిన్ రిలీవర్, బర్న్‌జెల్, బ్యాండేజీ, దుస్తులు కత్తిరించడానికి చిన్నపాటి కత్తెర, కొన్ని రకాల మాత్రలు, హ్యాండ్ గ్లౌవ్స్, థర్మామీటర్ ఉంచాలి. ప్రయాణికులు గుర్తించేలా ప్రథమ చికిత్స పెట్టెపై నీలం రంగు క్రాస్ మార్క్ ఉండాలి.

**జాగ్రత్తలు అవసరం**

ప్రథమ చికిత్స పెట్టెలో ఉన్న మందుల గడువు తేదీ చూడాలి.
తరచూ పరిశీలిస్తూ అవసరమైన వస్తువులు భర్తీ చేయాలి.
కావాల్సిన సమాచారం(అత్యవసర నంబర్లు, ఆసుపత్రి చిరునామాలు) అందులో ఉండేలా చూడాలి.

# అతి వేగం.. అధిక బరువు

జగిత్యాల : జిల్లాలో కంకర, మట్టి, మొరం, గ్రానైట్ తరలించే వాహనాలు ప్రమాదకరంగా నడుస్తున్నాయి. పరిమితికి మించిన బరువుతో పాటు అతి వేగంతో ఇతర వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. పలు ప్రాంతాల్లో రాత్రింబవళ్లు తేడా లేకుండా తరలిస్తుండటం ప్రమాదాలకు కారణమవుతోంది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల వద్ద ఈ నెల 3న జరిగిన ఘోర ప్రమాదంతో జిల్లాలోని టిప్పర్లు, గ్రానైట్ లారీల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల్లో దాదాపు 200కు పైగా లారీలు, టిప్పర్లు నడుస్తున్నాయి. వీటిలో నిత్యం కంకర, మొరం, ఇసుక తరలిస్తున్నారు. డ్రైవర్లు స్థానికులను కాకుండా ఇతర రాష్ట్రాల వారిని పెట్టుకుంటుండగా మద్యం, గంజాయి తాగి నడుపుతున్నారనే ఆరోపణలున్నాయి. జగిత్యాల పట్టణంలోనే పలుమార్లు అధిక వేగంతో వెళ్తున్న వాహనాలను స్థానికులు అడ్డుకున్న ఘటనలు వెలుగుచూశాయి. అధిక లోడ్‌తో వెళ్తున్నా రవాణా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కరీంనగర్ మార్గంలో రాత్రింబవళ్లు తేడా లేకుండా గ్రానైట్ లారీలు నడుస్తున్నా పట్టించుకొనేవారే లేరు. అత్యధికంగా టీఆర్‌నగర్, రాజారం, నర్సింగాపూర్ గుట్టల నుంచి కంకర, మట్టిని తరలిస్తున్నారు. కరీంనగర్-జగిత్యాల రహదారిపై అధిక ప్రమాదాలకు టిప్పర్లు, లారీల అతి వేగమే



కారణమవుతోంది.

**మద్యం మత్తులో డ్రైవింగ్..**

టిప్పరు డ్రైవర్లు నిద్ర లేకుండా, విశ్రాంతి లేకుండా నడపడంతో పాటు మద్యం మత్తులో ఉంటున్నారు.
కార్లు, ద్విచక్రవాహన చోదకులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసులు లారీలను పట్టించుకోవడం లేదు.
ప్రధాన రహదారులపై తరచూ బ్రీత్ అనలైజర్ పరీక్షలతో పాటు అతి వేగంగా నడిచే వాహనాలను సీసీ కెమెరాల ద్వారా పరీక్షించి జరిమానా విధించాలి. కేసులు నమోదు చేయాలి.
రవాణా శాఖ తనిఖీలు పెరిగితేనే ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుంది.
నంబరు ప్లేట్లు, ఫిట్‌నెస్ లేని వాహనాలపై దృష్టి సారించాలి.
రవాణా, పోలీసు శాఖల ఆధ్వర్యంలో టిప్పర్ల యజమానులకు అవగాహన సమావేశాలు నిర్వహించాలి.
జిల్లాలో పని చేసే ఇతర రాష్ట్రాల డ్రైవర్ల వివరాలు సేకరించడంతో పాటు వారి పనితీరుపై నిఘా ఉంచాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తనిఖీలు ముమ్మరం చేశాం: శ్రీనివాస్, జిల్లా రవాణా శాఖ అధికారి

చేవెళ్ల ప్రమాదం తర్వాత జిల్లావ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశాం. జిల్లావ్యాప్తగా అన్ని టిప్పర్లను పరిశీలిస్తాం. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తాం. పోలీసు శాఖ సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం.



# నిజం.. మూడుసార్లు ఎమ్మెల్యే.. ఆ తర్వాత సర్పంచ్

ఈ రోజుల్లో ఒకసారి ఎమ్మెల్యే అయితే, వారి టార్గెట్ మంత్రి పదవి పొందడమే.. ఆ తర్వాత ముఖ్యమంత్రి పీఠమే లక్ష్యం..! లేదా ఎంపీ అయితే, కేంద్ర మంత్రి పదవి పొందడమే గోల్..! ముఖ్యమంత్రిగా చేసినవారు కేంద్ర మంత్రులు అయ్యారు కానీ... అసలు సీఎంగా చేసినవారు మంత్రిగా పనిచేయడం తెలుగు రాష్ట్రాల చరిత్రలో లేదు.. ఇదీ రాజకీయ పరమపద సోపాన పటం. ఒక్కసారి ఒక పదవి తీసుకుని అడుగు ముందుకేస్తే మళ్లీ వెనక్కు రావొద్దు అన్నది నాయకుల విధానంగా ఉంటుంది..! కానీ, ఒక నాయకుడు ఎమ్మెల్యేగా ఒకటికి మూడుసార్లు ఎన్నికై.. ఆపై సర్పంచిగా చేశారు. మూడుసార్లు ఎమ్మెల్యే అంటే.. దాదాపు సీఎం అయ్యేంత అర్హత. కానీ, ఆయన ఎలాంటి భేషజం లేకుండా గ్రామస్థాయి పదవి అయిన సర్పంచి గిరీని ఇష్టంగా స్వీకరించారు. ఇదంతా ఎక్కడో మారుమూల నియోజకవర్గం ఎమ్మెల్యే గురించి అనుకుంటే పొరపాటే.. హైదరాబాద్ కు కూతవేటు దూరంలోని, రాజకీయ చైతన్యానికి మారుపేరుగా నిలిచే సూర్యపేటలో కావడం గమనార్హం. ఇంతకూ ఆ ఎమ్మెల్యే ఎవరంటే..?

**సిరికొండ ఉప్పల మల్సూర్...** ప్రస్తుతం తెలంగాణలో పంచాయతీ ఎన్నికల హంగామా నడుస్తోంది. రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో (కోర్టు కేసులు లేని) మూడు దశల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. వచ్చే నెల 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజు ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఈ నేపథ్యంలో తొలి దశ పోలింగ్ కు నామినేషన్ల దాఖలుకు శనివారంతో గడువు ముగిసింది. ఆదివారం పరిశీలన, డిసెంబరు 3న ఉపసంహరణ ఉంటుంది. ఇదే సమయంలో ఒక ఎమ్మెల్యే సర్పంచి గురించి చెప్పుకోవాలి. ఆయనే ఉప్పల మల్సూర్. ఒకప్పటి ఉమ్మడి నల్లగొండ ప్రస్తుత సూర్యపేట జిల్లా సిరికొండకు చెందిన మల్సూర్ హైదరాబాద్ స్టేట్, ఉమ్మడి ఏపీలో సూర్యపేట నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత ఆయన ఏకగ్రీవంగా తమ సిరికొండ గ్రామానికి సర్పంచి అయ్యారు. గ్రామస్థుల కోరిక మేరకు మల్సూర్ ఎలాంటి భేషజం లేకుండా ఈ పదవి చేపట్టారు.

**1952లో మొదలు..** హైదరాబాద్ స్టేట్ కొనసాగిన సమయంలో మల్సూర్ 1952లో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1956 వరకు కొనసాగారు. పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్ తరఫున ఆయన గెలిచారు. మధ్యలో 1957-62 సమయంలో ఓడిపోయారు. 1962-72 వరకు పదేళ్లు సర్పంచ్ గా కొనసాగారు. చివరి రెండు సార్లు సీపీఐ తరఫున అసెంబ్లీకి వెళ్లారు. ఇక ఆ తర్వాత నుంచి ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినట్లు లేదు. అనంతరమే తమ సిరికొండ గ్రామానికి సర్పంచిగా వ్యవహరించినట్లు స్పష్టమవుతోంది.

# పాఠాలు చెప్పేందుకు టీచర్ వినూత్న ప్రయత్నం.. దేశం దృష్టి అతనిపైనే



పెద్ద పెద్ద టెక్ కంపెనీలు, విశేషమైన ప్రయోగశాలలు, కోట్ల రూపాయల పెట్టుబడులు సాధారణంగా 'ఆవిష్కరణ' అంటే మనకు గుర్తొచ్చేది ఇవే. కానీ ఓ చిన్న గ్రామంలో 17 ఏళ్ల ఇంటర్ విద్యార్థి తన గదిలో కూర్చుని, కేవలం ఇష్టంతో, ఆసక్తితో, ప్రయోగాలపై పిచ్చితో తయారు చేసిన రోబోట్ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆ విద్యార్థి పేరు ఆదిత్య.. అతని కల్పనకు రూపం 'సోఫీ' ఒక్కసారిగా ఈ కథనం ఒక చిన్నారి ప్రతిభ గురించికాదు.. మొత్తం భారత విద్యా వ్యవస్థ ఎదురుచూస్తున్న ఒక కొత్త మార్గదర్శక సంకేతంగా మారింది.

**భవిష్యత్ వాటిదే కానుందా..?...** యూపీ బులంద్‌షహర్‌కు చెందిన ఆదిత్య కుమార్ ఇంటర్ చదువుతున్న వయసులోనే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భవిష్యత్తు అని నిరూపించాడు. ఎల్ఎల్ఎమ్ చిప్‌సెట్‌తో పనిచేసే ఒక పూర్తి స్థాయి ఏఐ టీచర్ రోబోట్‌ను రూపొందించి, దానికి 'సోఫీ' అనే పేరు పెట్టాడు. ఈ రోబోట్ కేవలం కదిలే పరికరం కాదు.. ఇది స్వయంగా పరిచయం చేసుకుని, పిల్లలకు బోధిస్తుంది, ప్రశ్నలకు సమాధానమిచ్చే ప్రత్యేక శిక్షణా సాధనం. 'నేను సోఫీ.. బులంద్‌షహర్‌లోని శివ్‌చరన్ ఇంటర్ కాలేజీలో బోధిస్తున్నాను' అని సామాజిక మాధ్యమాల్లో చెప్పిన వీడియో దేశవ్యాప్తంగా వైరల్ అయింది.

**కేవలం రూ. 25వేలకే రోబో..** ఆదిత్య దీనిని సుమారు రూ.25 వేలే ఖర్చు పెట్టాడు. ఈ మొత్తం ఒక పెద్ద సంస్థకు చిల్లర అయి ఉండొచ్చు, కానీ ఒక విద్యార్థి తక్కువ ఖర్చుతో, సొంత పద్ధతిలో ఇంత పెద్ద ఆవిష్కరణను చేయడం అసాధారణం. తమిళ సినిమా 'రోబో' నుంచి ప్రేరణ పొంది సంవత్సరాల ప్రయత్నంతో సోఫీ రూపుదిద్దుకుంది. సోఫీ ఉన్నత స్థాయి విద్యను అందించే ప్రొఫెషనల్ ఏఐ సిస్టమ్ కాదు.. కానీ దానికి ఇది ఏమాత్రం తీసిపోదు. భారత తొలి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ పేరు చెప్పగలదు. ప్రాథమిక గణిత గణనలు చేయగలదు. 'విద్యుత్ అనేది చార్జ్డ్ పార్టికిల్స్ కదలికతో ఏర్పడిన శక్తి' అని చిన్నారులుకు వివరిస్తుంది. బోధనా పాఠాలను అర్థవంతంగా అందిస్తుంది. ఒక విద్యార్థి చేతుల్లో తయారైన రోబోట్‌కి ఇది చిన్న విషయం కాదు.. ఈ జ్ఞానం ఒక గ్రామం తరగతి గదిలోకి అడుగుపెట్టిన సాంకేతిక విప్లవం. అయితే, సోఫీ కథ కేవలం సాంకేతిక విజయమే కాదు.. అది భారత గ్రామీణ విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లకు ప్రత్యామ్నాయ ప్రతిపాదన. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత. సరైన టీచర్లు పట్టణాలకు వెళ్లిపోవడం. విద్యార్థులు పాఠ్యాంశ్నా అర్థం చేసుకోవడంలో పడుతున్న ఇబ్బందులు వీటన్నింటికి టెక్నాలజీ ఒక పరిష్కారాన్ని చూపిస్తుంది. ఆదిత్య కూడా అదే చెబుతున్నాడు. 'గ్రామీణ ప్రాంతాలలో ఉపాధ్యాయుల కొరతను వీటితో తగ్గించొచ్చు' అంటున్నాడు. సోఫీ రాయడం, నోట్స్ తయారు చేయడం వంటి సామర్థ్యాలు కూడా భవిష్యత్తులో రానున్నాయని ఆదిత్య చెబుతున్నాడు. అంటే, ఇది కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు.. ఇది ఒక ప్రయోగశాల, ఒక పిల్లవాని చేతుల్లో పుట్టిన విప్లవం. ఇదే సమయంలో, యువ ఆవిష్కర్తల కోసం పరిశోధనా ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కోరడం ఒక పెద్ద సందేశం.


**టీచింగ్ లో ఏఐ..** ఈ కథ మనకు ముఖ్యమైన విషయాను బోధిస్తోంది. ఏఐ బోధనలో కూడా అడుగు పెడుతుంది.. అంటే టీచర్ల పాత్ర తగ్గిపోతుంది అన్న అపోహలు ఉన్నా, సోఫీ చెప్పిన సమాధానాలు చూసినప్పుడు స్పష్టం అవుతుంది. మంచి బోధన అంటే మానవ సంబంధంసాంకేతిక సాయం. రెండూ కలిసి ఉంటేనే భవిష్యత్తు పాఠశాలలు బలపడతాయి. ఆదిత్య కథ ఒక చిన్నారి కల, ఒక ఇల్లు, ఒక గ్రామం దాటిపోయి ఇప్పుడు మొత్తం దేశానికి ప్రేరణగా నిలిచాడు. ప్రతిభ కేవలం నగరాల్లోనే కాదు.. మన ఊళ్లలో, మన ఇంట్లో, మన పిల్లల్లో దాగి ఉంది. కనుక పాలసీ మేకర్లు, విద్యా వ్యవస్థ, సమాజం ఇప్పుడు ఈ ప్రతిభను వెలికి తీసే సమయం వచ్చింది. సోఫీ ఒక రోబోట్ కాదు.. అది భారత భవిష్యత్తు తరగతి గదిలో వినిపించే తొలి అడుగు శబ్దం.

# గాల్లో పుస్తకాలు.. ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆశ్చర్యపోయిన వాహనదారులు

ఉస్మానియా యూనివర్సిటీ డిగ్రీ పరీక్షల్లో సామూహిక నకలు ఉదంతం మరోసారి బయటపడింది. ఎగ్జామ్ రూమ్‌లో పుస్తకాలు, ఫోన్లు దగ్గర పెట్టుకొని సులభంగా పరీక్ష రాస్తున్న విద్యార్థులు.. ఫ్లయింగ్ స్క్వాడ్ వస్తుందనే సమాచారం అందుకున్న క్షణాల్లోనే గందరగోళానికి గురయ్యారు. ఒక్కసారిగా భయపడి, ఎవరి చేతిలో ఏమున్నా కిటికీల్లోంచి బయటకు విసిరేయడం ప్రారంభించారు. పైఅంతస్తుల నుంచే పుస్తకాలు గాలిలో ఎగిరి రోడ్డుపై పడిపోవడం చూసి, బయట వెళ్తున్నవాళ్లు షాక్ కు గురయ్యారు.

**గాల్లో నుంచి పడుతున్న పుస్తకాలు..** ఒక్కో పుస్తకం గాల్లో తేలుతూ కింది పడిన తీరు చూస్తే, క్లాసురూమ్ లోపల ఎంత ప్లాన్ జరిగిందో అర్థమవుతుంది. విద్యార్థులు ఎవరు గమనిస్తున్నారో, ఎవరైనా వీడియో తీస్తున్నారో అనే ఆలోచన లేకుండా, 'ఎలాగైనా పట్టుబడకూడదు' అన్న ఆతృతతో ఉన్నట్లు స్పష్టంగా కనిపించింది. కేవలం పుస్తకాలు మాత్రమే కాదు.. కొందరు ఫోన్లను బయటకు విసిరేశారు. పరీక్ష మధ్యలోనే ఇంత పెద్ద గందరగోళం జరగడంతో ఆ సెంటర్ చుట్టుపక్కల ఉన్నవాళ్లు ఆశ్చర్యపోయారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతోంది. పై ఫ్లోర్‌లోని క్లాసుల నుంచి ఒక్కసారిగా పుస్తకాలు, నోట్‌బుక్స్ కురిసిపడుతున్న దృశ్యం నెటిజన్లలో పెద్ద చర్చకు దారితీసింది. విద్యార్థులు పరీక్షలను ఎంత సరదాగా తీసుకుంటున్నారు? యూనివర్సిటీ మానిటరింగ్ ఎంత నిర్లక్ష్యంగా ఉంది? అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ సెంటర్‌కి చేరుకునేలోపే, అక్కడి విద్యార్థులు తమ అక్రమ 'అస్త్రాలను' బయటికి విసిరేసి సీన్‌ను క్లియర్ చేయడానికి ప్రయత్నించినట్లు తెలిసింది.

**యూనివర్సిటీ తీరుపై వెల్లువెత్తుతున్న ప్రశ్నలు..** ఓయూ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ కొత్త విషయం కాదు.. కానీ ఈసారి విద్యార్థుల పరుగులు, కిటికీల్లోంచి పుస్తకాలు పడవేస్తున్న తీరు మాత్రం యూనివర్సిటీ పరిపాలనపై ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. పరీక్షల సమయంలో మొబైల్ ఫోన్లు, గైడ్‌లు, నోట్‌లు ఇలా ఎటువంటి పదార్థాలూ ఉండకుండా చర్యలు తీసుకోవాలి అనేది నియమం. కానీ ఇక్కడ మాత్రం క్లాస్‌రూంలోనే పుస్తకాలు విరివిగా ఉండడం, ఫ్లయింగ్ స్క్వాడ్ రాకవరకు ఎవరూ పట్టించుకోకపోవడం పరీక్షా వ్యవస్థపై అనుమానాలు రేపుతున్నాయి. ఈ వీడియోలు బయటకు రావడంతో ఓయూ అధికారులు దీనిపై విచారణ ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాపీయింగ్ పై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పే యూనివర్సిటీ.. ప్రాక్టికల్‌గా మాత్రం ఇటువంటి ఘటనలు జరుగుతుండడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వైరల్ ఘటనతో, పరీక్షల నిర్వహణలో పటిష్ట పర్యవేక్షణ ఎంత అవసరమో మరోసారి స్పష్టమైంది.



# కేరళ ఆరోగ్య శాఖ నోట్.. శబరిమల యాత్రలో 2 చోట్ల గుండెపోటు ముప్పు?




ట్విస్టు చేసేందుకో.. వార్తను చదివించే కక్కుర్తితో ఈ హెడ్డింగ్ పెట్టలేదు. ఆ మాటకు వస్తే.. కేరళ ఆరోగ్య శాఖ స్పష్టం చేసిన అంశమన్న చేదు నిజాన్ని అస్సలు మిస్ కావొద్దు. అవును.. ఎంతో భక్తిశ్రద్ధలతో దీక్ష చేపట్టి.. శబరిమలలో వేం చేసి ఉన్న అయ్యప్పస్వామిని సందర్శించేందుకు వెళ్లే భక్తులు.. కేర్ ఫుల్ గా ఉండాల్సిన అంశాలకు సంబంధించిన వివరాలివి. శబరిమల యాత్రికులకు రెండు చోట్ల గుండెపోటు ముప్పు పొంచి ఉంది,, సముద్రమట్టానికి ఎత్తైన ప్రాంతంలో నడుస్తున్న వేళ.. డీహైడ్రేషన్.. ఆక్సిజన్ లభ్యత తక్కువగా ఉండే ప్రతికూల కారణాలతో గుండెపోటు ముప్పు ఉందన్న విషయాన్ని గుర్తించారు. ఈ విషయాల్నికేరళ వైద్య ఆరోగ్య శాఖ సైతం స్పష్టం చేస్తోంది. పంపా బేస్ నుంచి శబరిమలకు వెళ్లే చిన్నపాదం మార్గం అత్యంత కఠినమైనదిగా పిలిచే నీలిమలతో పాటు కొండ శిఖరాగ్రంలో ఉండే అప్పాచిమేడు వద్ద భక్తులకు గుండెపోట్లు ఎక్కువగా వస్తున్న విషయాన్ని ఆరోగ్య శాఖ జారీ చేసిన అలెర్టులోనూ పేర్కొన్నారు. ప్రతి ఏడాది నీలిమల.. అప్పాచిమేడు ప్రాంతాల్లో భక్తులు గుండెపోటుతో కుప్పకూలుతున్న ఉదంతాలు.. మరణాలు ఎక్కువగా నమోదవుతున్న విషయాన్ని ట్రావెన్ కోర్.. కేరళ వైద్య ఆరోగ్య శాఖ.. పోలీసు క్రైం డేటా రికార్డ్ బ్యూరో గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2017-18 సీజన్ లో 281 మంది గుండెపోటుకు గురి కాగా.. వీరిలో 36 మంది మరణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గడిచిన ఏడేళ్ల సీజన్ లో చోటు చేసుకున్న ఉదంతాలతో ఈ డేటాను సిద్ధం చేశారు. ఎందుకిలా జరుగుతుందన్న విషయానికి వస్తే.. సముద్ర మట్టానికి ఎత్తులో ఉండటం.. ఆక్సిజన్ స్థాయిలు తక్కువగా ఉండటంతో నీలిమల.. అప్పాచిమేడు ప్రాంతాల్లో గుండెపోట్లు ఎక్కువ. నీలిమల కొండ నిటారుగా.. చాలా ఎత్తుగా ఉంటుంది. శబరిమల యాత్రలో పెద్దపాదంలో ముక్కు కొండగా పిలిచే కరిమల కొండ తరవాత.. చిన్నపాదంలో దాదాపు అదే స్థాయిలోనే నీలిమల ఉంటుంది. నీలిమలను ఎక్కే వారి కోసం ట్రావెన్ కోరు మెట్లు ఏర్పాటు చేసినా.. భక్తులు మత్రం ఈ ఒక్క కొండను ఎక్కేస్తే.. ఇబ్బందులు దూరమవుతాయన్న ఉద్దేశంతో నడకలో వేగాన్ని పెంచుతారు. మరికొందరు తమ టీంలోని వారు కొందరు ముందుకు వెళ్లిపోయారన్న ఉద్దేశంతో.. వారిని అందుకోవాలన్న తలంపుతో నడకలో వేగాన్ని పెంచుతారు. దీంతో హార్ట్ బీట్ లో మార్పులు చోటు చేసుకుంటాయి. సముద్ర మట్టానికి ఎత్తుగా ఉండటం.. ఆక్సిజన్ తగ్గటం.. ఆక్సిజన్ అవసరం ఎక్కువగా ఉండే వేళలో ప్రాణవాయువు సరిగా అందక బాడీలో ఆక్సిజన్ స్థాయిలో పడిపోతాయి. దీంతోగుండెకు రక్త సరఫరా నెమ్మదిస్తుంది. ఈ కారణంగా గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. షుగర్.. బీపీ ఉన్న వారితో పాటు ఆరోగ్య సమస్యలు.. కొలెస్ట్రాల్.. ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు నీలిమల.. అప్పాచివేడు ప్రాంతంలో నడిచే వేళలో నడక వేగాన్ని అస్సలు పెంచొద్దని సూచన చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఆక్సిజన్ సెంటర్లను ఏర్పాటు చేసినప్పటికి మరణాలు ప్రతి ఏటా పెరుగుతున్నట్లుగా చెబుతున్నారు. దీక్ష తీసుకున్న స్వాములు రేయిబవళ్లు ప్రయణాలు చేయటం.. సమయానికి భోజనం తీసుకోకపోవటం చేస్తారు. కేవలం శాఖాహార హొటళ్లలో మాత్రమే భోజనం చేయాల్సి రావటంతో.. కంటి నిండా నిద్ర.. కడుపు నిండా తిండి ఉండక శరీరం అలసిపోతుందని చెబుతారు. ఇలాంటప్పుడే డీహైడ్రేషన్ పెరిగి.. గ్లూకోజ్ స్థాయిలు.. ఎలక్ట్రోలైట్లు తగ్గి గుండె మీద ఒత్తిడి పెరుగుతుందని చెబుతున్నారు ఈ సందర్భంగా గుండెపోట్లు వస్తాయని చెబుతున్నారు. దీంతో పాటు మరో కారణాన్ని పలువురు ప్రస్తావిస్తున్నారు. భక్తులు పలువురు పంపా బేస్ కు చేరుకున్నంతనే అక్కడి హొటళ్లలో భోజనం చేస్తారు.

ఆ వెంటనే కొండ ఎక్కే పని మొదలు పెడతారు. ఇది చాలా ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు భోజనం తర్వాత రక్తప్రసరనణ ఎక్కువగా జీర్ణాశయం వైపు వెళుతుందని.. అప్పుడు రెట్టింపు ఒత్తిడి ఉంటుందని.. కడుపు నిండా భోజనం ఉన్నప్పుడు గుండెపోటు సంభవిస్తే రిస్కు ఎక్కువని హెచ్చరిస్తున్నారు. అందుకే ఈ రెండు ప్రాంతాల్లో నడిచే భక్తులు.. అక్కడ నిదానంగా కొండ ఎక్కటం మంచిదని సూచన చేస్తున్నారు. కొవిడ్ కాలంలో భక్తుల్ని పరిమిత సంఖ్యలోనే అనుమతించిన కారణంగా గుండెపోట్లు తక్కువగా నమోదయ్యాయి. 2018-19లో 24 మంది మరణిస్తే.. 2019-20లో 19 మంది.. 2022-23లో 24, 2023-24లో 24.. 2024-25లా 40 మంది భక్తులు గుండెపోటుతో మరణించినట్లుగా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సో. స్వాములు బీకేర్ ఫుల్.

# అహంకారం కరిగిన చోట బలంగా భారత్ ఉనికి

ఈ మాటలు కవిత కాదు, ఒక కీలక వ్యాఖ్య. పైకి సింపుల్ గా కనిపిస్తున్నా ఈ వ్యాఖ్య వెనక లోతైన భావన ఉంది. భారత దేశం గర్వర్మ్ గౌరవం, కల్చర్ దేశం ఆత్మ విశ్వాసం, పట్టుదల అన్నీ ఇందులోనే ఇమిడి ఉన్నాయి. భారత్ ని దాని గొప్పతనాన్ని ఒకనాడు అంగీకరించలేని స్థితిలో ఉన్న కొన్ని దేశాలు కానీ ప్రపంచలోని కొంత భాగానికి కానీ భారత్ ఉనికి ఎపుడు కనబడిందో తెలియచెప్పే ప్రయత్నమే ఈ వ్యాఖ్య. ఇంతటి పవర్ ఫుల్ వ్యాఖ్యను చేసిన వారు ఎవరై ఉంటారు అంటే సందేహమే లేదు, దేశమే ఫస్ట్ అని సదా నినదించే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్. ఆర్ఎస్ఎస్ అన్న మాట. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ తాజాగా మహారాష్ట్రలోని నాగపూర్ వేదికగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ కీలకమైన వ్యాఖ్యలు చేశారు.

**భారత్ బలంగా :** మోహన్ భగవత్ మాటలలో చెప్పాలి అంటే భారత్ ఎపుడూ బలంగానే ఉంది. తనదైన ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగిపోతోంది. అయితే భారత్ గొప్పతనాన్ని గుర్తించడానికి ఏ మాత్రం అంగీకరించని వారి కళ్ళకు అహంకారం పొరలు కమ్మేశాయి అన్నది ఈ వ్యాఖ్యల వెనక ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. ఇపుడు ఆ అహంకారం కరిగిన వేళ భారత్ ఉనికిలోకి వచ్చింది అని ఆయన చెప్పుకొచ్చారు.




మరో వైపు చూస్తే భారత్ ఈనాడు ఆర్థికంగా ముందుకు సాగుతోంది. అలాగే అగ్ర రాజ్యాలు అన్న వాటిని సైతం పక్కన పెట్టి భారత్ తన సొంత వ్యక్తిత్వంతో కొనసాగుతోంది. భారత్ చొరవ కానీ భారత్ మాట కానీ భారత్ పాత్ర కానీ లేకుండా ప్రపంచంలో ఏమీ జరగని పరిస్థితి ఉంది అని గుర్తు చేస్తున్నారు.

**జాతీయ వాదం కంటే గొప్పది :** భారతదేశంలో జాతీయ వాదం ఒక సమస్య ఎపుడూ కానే కాదని మోహన్ భగవత్ అన్నారు. అదే సందర్భంలో జాతీయ భావనను దేశం పూర్వం నుంచే అనుసరిస్తూ వస్తోంది ఇది ఇతర దేశాలకు ఎంతో విభిన్నమైన భావన అని ఆయన అన్నారు. అంతే కాదు రాజకీయంగా భౌగోళికంగా దానిని ఏ మాత్రం దేశ ప్రజలు ఎప్పుడూ చూడలేదని అంతా ఒక్కటి అన్నది ఒక అలౌకికమైన భావనగా ఆయన అభివర్ణించారు.

**వివాదాలకు దూరం :** అంతే కాదు భారత దేశం ఎపుడూ వివాదాలకు విభేదాలకు దూరంగా ఉంటుందని ఆయన చెప్పారు. అందరూ కలసి ఉండాలన్నది భారత్ లో అంతర్లీనమైన భావనగా ఆయన చెప్పారు. అంతా కలసి ముందుకు సాగాలి అన్నదే భారత్ స్వభావం అదే విధానం, అదే సంస్కృతిగా ఆయన వివరించారు. సాంస్కృతిక సహజీవన సిద్ధాంతం భారత్ పునాదుల నుంచి ఉందని ఆయన అన్నారు. భారత దేశం ఎవరి పట్ల ఆధిపత్యం చూపదని, సమిష్టి స్ఫూర్తిని గౌరవిస్తుందని ఆయన చెప్పారు. అంతే కాదు దేశమంతా సమిష్టిగా సామరస్యంగా ప్రగతి దారులు వెతుకుతుందని దాని వెనక బలమైన తాత్విక పునాది ఉండడమే కారణం అని ఆయన గుర్తు చేశారు ఇక ఆర్ఎస్ఎస్ కూడా ఎవరినీ దూరం చేసుకోదని అందరికీ సమదృష్టితో చూస్తుందని వ్యక్తుల సమూహాన్నే గౌరవిస్తుందని సంకుచిత భావజాలాన్ని ఎపుడూ ఆర్ఎస్ఎస్ నమ్మినది లేదని మోహన్ భగవత్ స్పష్టం చేశారు.

# అసోంలో మరో రచ్చ..

## 6 ప్రధాన కులాలకు ఎస్టీ హోదా

అసోం మరో భగ్గుమంది. అక్కడి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇందుకు కారణమైంది. ఆరు ప్రధాన కులాలకు ఎస్టీ హోదా కల్పించాలన్న ప్రతిపాదనపై మంత్రుల టీం తమ మధ్యంతర రిపోర్టును అసెంబ్లీకి సమర్పించటంతో ఈ అంశం ఇప్పుడు కొత్త అలజడికి కారణమైంది. గిరిజన శాఖా మంత్రి రానిజ్ పెగు తాజా నివేదికను అసెంబ్లీకి సమర్పించారు. దీనిపై గిరిజన విద్యార్థులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ జాబితాలోని ప్రధాన కులాల వారు ఎప్పటి నుంచో గిరిజన హోదా కోసం డిమాండ్ చేస్తున్నారు అయితే.. ప్రస్తుతం గిరిజన గుర్తింపు పొందిన వారి ప్రయోజనాలకు ఎలాంటి నష్టం జరగకుండా తాజా నిర్ణయం తీసుకున్నట్లుగా గిరిజన మంత్రి అసెంబ్లీలో వెల్లడించారు. నివేదికలోని అంశాలు.. గణాంకాల్ని సభకు తెలియజేశారు. తాజాగా గిరిజన హోదా కల్పించాలని చెబుతున్న కులాల విషయానికి వస్తే.. - అహోం - చుటియా - మోరాన్ - మతక్ - కోచ్ - రాజ్ భోంగ్సి - తేయాకు ఆదివాసీలు (గిరిజనులు)




ఈ ఆరు కులాల వారు ఎప్పటి నుంచో తమను ఎస్టీలుగా గుర్తించాలని కోరుతున్నారు. తమ ప్రతిపాదన కారణంగా ప్రస్తుతం గిరిజనులుగా ఉన్న వారికి ఎలాంటి నష్టం జరగకుండా ఉండేలా కసరత్తు చేసినట్లుగా పేర్కొన్నారు.దీనికి సంబంధించినే మార్పులుచేర్పులు.. గణాంకాల్ని వెల్లడించారు. అయితే.. ఈ ఆరు బోర కులాలకు ఎస్టీ హోదాపై మంత్రుల టీం సమర్పించిన మధ్యంతర నివేదికపై గిరిజన విద్యార్థి సంఘం భగ్గుమంది. బహిరంగంగా వారు తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. విశ్వవిద్యాలయం నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలోని బోడోలాండ్ ప్రాదేశిక మండలి వరకు గిరిజన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వారికి అడ్డుగా ఏర్పాటు చేసిన బారికేడ్లను బద్ధలు కొట్టుకొని లోపలకు ప్రవేశించిన ఆందోళనకారులు ఫర్నిచర్ ను ధ్వంసం చేశారు. పరిస్థితి చేజారిపోతున్న నేపథ్యంలో అదనపు పోలీసు బలాగాల్నిరంగంలోకి దింపాల్సి వచ్చింది. అప్పటికి కానీ ఆందోళనలు సద్దుమణగలేదు. మంత్రుల రిపోర్టుపై భగ్గుమన్న ఆల్ బోడో స్టూడెంట్స్ అసోసియేషన్.. పలు ఇతర అనుబంధ గిరిజన యూనియర్లు నిరసనలు.. ధర్నాలు.. ర్యాలీల్లో పాల్గొన్నాయి. ఈ అంశాన్ని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టటం ఇది రెండోసారిగా చెప్పాలి.

## పవన్ హీరోయిన్ హాఫ్ షోల్డర్ ఫ్రాక్ కిరాక్

పవన్ కల్యాణ్ సరసన తీన్ మార్ చిత్రంలో నటించింది కృతి కర్బంద. ఆ తర్వాత సుమంత్ బోణిలో నటించింది. ఈ రెండు అవకాశాలు తనకు ఏ విధంగాను కలిసి రాలేదు. అవి రెండూ ఫ్లాపులుగా మిగలడంతో ఆ తర్వాత బాలీవుడ్ లో కెరీర్ కోసం ప్రయత్నించింది. కానీ అక్కడ కూడా అంతంత మాత్రమే. అక్షయ్ హౌస్ ఫుల్ 4 లాంటి క్రేజీ మూవీలో నటించింది. అక్షయ్-పూజ.. తుషార్-కృతి సనోన్ .. బాబీ డియోల్- కృతి కర్బంద జంటల మధ్య పునర్జన్మల కథ తో తెరకెక్కిన ఈ చిత్రం అడల్ట్ కంటెంట్ కారణంగా, విమర్శల పాలైంది. అయినా బాక్సాఫీస్ వద్ద బాగానే వసూలు చేసింది. ప్రస్తుతం రిస్కీ రోమియో అనే చిత్రంలో నటిస్తోంది. కానీ ఈ సినిమా గురించిన సరైన వివరాలు వెల్లడి కాలేదు. కృతి ఇటీవల పూర్తిగా తన భర్త, కుటుంబంతో గడిపేందుకే ఎక్కువగా ప్రాధాన్యతనిస్తోంది. ఇటీవల ఈత కొలను వద్ద తన భర్త పుల్కిత్ సామ్రాట్ తో పాటు కనిపించింది. ప్రతిసారి భర్తతో కలిసి వెకేషన్స్ ప్లాన్ చేయడంలోను కృతి బిజీగా ఉంది. పుల్కిత్ ని సల్మాన్ ఖాన్ స్వయంగా హీరోగా పరిచయం చేయగా.. ఆరంభం రోహిరాతో డేటింగ్ చేశాడు. పాత గాళ్ ఫ్రెండ్ కి బ్రేకప్ చెప్పి తర్వాత కృతితో ప్రేమాయణం ప్రారంభించాడు. అదే సమయంలో కృతి కెరీర్ పరంగా ఎదిగేందుకు



ప్రయత్నిస్తూ, వాన్ అనే తమిళ చిత్రం సహా హిందీలో థైస్..14 పెరే అనే రెండు చిత్రాలతో బిజీ అయింది. కానీ ఇవేవీ తన భవిష్యత్ కి ఉపయోగపడలేదు. కృతి కర్బంద ఇతర వ్యాపకాలను పరిశీలిస్తే, ఇటీవల గ్లోబల్ స్పా కవర్ స్టార్ గా మారింది. దానికి సంబంధించిన ఫోటోషూట్ కూడా రివీలైంది. ఇప్పుడు అడపాదడపా తన కొత్త లుక్ కి సంబంధించిన ఫోటోగ్రాఫ్స్ ని కృతి ఇన్ స్టాలో షేర్ చేస్తుంటే అవన్నీ వైరల్ గా మారతున్నాయి. తాజాగా హాఫ్ షోల్డర్ ఫ్రాక్ లో కృతి అందాల ఎలివేషన్ యువతరంలో గుబులు పెంచుతోంది. మెరూన్ కలర్ ఫ్రాక్ ధరించిన కృతి, వీ లుక్ లో తన అందాలను ఎలివేట్ చేసింది. ఇక ఆ మెడలో లైట్ వెయిట్ పెండెంట్ ఎంతో అందంగా కనిపిస్తోంది. కృతి తనకు ఎలాంటి సినిమాల్లో నటించాలనుంది? అనేది ప్రశ్నిస్తే, దేవదాస్ రీమేక్ లో నటిస్తానని సమాధానమిచ్చింది. ఆదర్శవంతమైన రోజు సెలవు ఎలా ఉంటుందో కూడా కృతి వివరించింది. ఆశ్చర్యకరంగా ఆరోజు తన భర్త పుల్కిత్ సామ్రాట్ తనతో ఉండాలని చెప్పింది. నేను అతడితో పాడిల్ - పికిల్ ఆడటం ఇష్టపడతాను.. అని తెలిపింది. ఒక క్లాసిక్ సినిమా రీమేక్‌లో నటించే అవకాశం ఎప్పుడైనా లభిస్తే, రొమాంటిక్ డ్రామా దేవదాస్ ని ఎంపిక చేసుకుంది.

## డైరెక్టర్ కోసం హీరో వెయిటింగ్ !

అన్నీ అనుకున్నట్లు జరిగితే ఎల్ సీ యూ నుంచి ఖైదీ 2 ఇప్పటికే మొదలవ్వాలి. కానీ కార్తీ వేర్వేరు సినిమాలతో బిజీగా ఉండగా, లోకేష్ కనగరాజ్ తన పనుల్లో తాను బిజీగా ఉన్నాడు. మరి ఈ డిలేకి కారణం ఏంటి? అంటే? కొన్నాళ్ల పాటు డైరెక్షన్ పక్కన బెట్టి హీరోగా లక్ చెక్ చేసుకోవడమే. కూలీ రిలీజ్ అనంతరం లోకేష్ కనగరాజ్ హీరోగా మ్యాకప్ వేసుకున్న సంగతి తెలిసిందే. అరుణ్ మాథేశ్వర్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. లోకేష్ మార్క్ క్రైమ్ థ్రిల్లర్ కావడం..హీరో ఛాన్స్ అనే సరికి లోకేష్ కూడా వెయిటింగ్ ఎందుకునుకున్నాడో? ఏమో గానీ మారు మాట్లాడకుండా పట్టాలెక్కించాడు ప్రాజెక్ట్. డీసీ అనే టైటిల్ తో తెరకెక్కుతోన్న చిత్రమిది. మరి ఈ సినిమా రిలీజ్ ఎప్పుడు అంటే వచ్చే ఏడాది సమ్మర్ వరకూ రిలీజ్ కాదు. మరి ఖైదీ2 మొదలయ్యేది ఎప్పుడు? అంటే రిలీజ్ తర్వాతేనని తెలుస్తోంది. దీంతో లోకేష్ కోసం కార్తీ వెయిట్ చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం కార్తీ హీరోగా మార్షల్ అనే సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమా తప్ప మరే సినిమా షూటింగ్ దశలో లేదు.



కార్తీ నటించిన వా వాతయార్ ఇప్పటికే రిలీజ్ కు రెడీ గా ఉంది. డిసెంబర్ లో ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. కార్తీ నటిస్తోన్న మరో చిత్రం సర్దార్ 2 కూడా షూటింగ్ పూర్తి చేసుకుంది.

**కార్తీకి ఇదో కొత్త ఎక్స్ పీరియన్స్:** ప్రస్తుతం ఆ ప్రాజెక్ట్ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఈ సినిమా వచ్చే ఏడాది ఆరంభంలో రిలీజ్ అవుతుంది. ఈ రెండు సినిమాలకు సంబంధించి కార్తీ కేవలం ప్రచార కార్యక్రమాల్లో మాత్రమే పూర్తి చేయాల్సి ఉంది. ఆ రెండు రిలీజ్ అయితే వాటి నుంచి పూర్తిగా రిలీవ్ అవుతాడు. మార్షల్ కూడా మరో రెండు..మూడు నెలల్లో షూటింగ్ పూర్తవుతుందని సమాచారం. ఆ తర్వాత ఖైదీ 2 మొదలయ్యే వరకూ కార్తీకి వెయిటింగ్ తప్పదు. ఆ వెయిటింగ్ లోకేష్ వల్లే. ఇలా డైరెక్టర్ కోసం హీరో వెయిట్ చేయడం అన్నది కార్తీ అనుభవంలో ఇదే తొలిసారి కావొచ్చు.

**కొత్త కథలు వినే ఛాన్సుంది:** సాధారణంగా హీరోల కోసం డైరెక్టర్లు వెయిట్ చేస్తుంటారు. కానీ లోకేష్-కార్తీ మధ్య సన్నివేశం అందుకు భిన్నంగా కనిపిస్తుంది. మరి ఈ గ్యాప్ లో కార్తీ ఏం చేస్తాడు? అంటే కొత్త కథలు వినడానికి అవకాశం ఉంది. మార్షల్ కూడా నత్తనడకన షూటింగ్ జరుతుంది. దీంతో కార్తీ కి సమయం ఎక్కువగానే దొరుకుతుంది. షూటింగ్ ఉంటే చేయడం లేదంటే కథలు వినడంపైనే దృష్టి పెడుతున్నట్లు తెలుస్తోంది.


సినిమా 'షో'

# 'వారణాసి' టైటిల్ లో న్యూ ట్విస్ట్




టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు లీడ్ రోల్ లో దర్శకధీరుడు రాజమౌళి.. వారణాసి మూవీ రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో గ్లోబల్ అడ్వెంచర్ డ్రామాగా తెరకెక్కుతున్న ఆ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే పలు షెడ్యూళ్లు కంప్లీట్ చేసిన జక్కన్న.. ఇప్పుడు కీలక సీన్స్ ను చిత్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ముందు చాలా సైలెంట్ గా పనికానిచ్చిన జక్కన్న.. కొన్ని రోజులుగా వరుస అప్డేట్స్ ఇస్తున్నారు. మూవీలోని లీడ్ రోల్స్ లుక్స్ తో పాటు రీసెంట్ గా భారీ ఈవెంట్ ద్వారా టైటిల్ ను రివీల్ చేశారు. ముందు నుంచి అనుకున్నట్లుగానే వారణాసి పేరును ప్రకటించారు. కానీ అప్పుడే అసలు చర్చ మొదలైంది. ఎందుకంటే వారణాసి టైటిల్ ను ఇప్పటికే మరో టాలీవుడ్ నిర్మాణ సంస్థ రామభక్త హనుమ క్రియేషన్స్ బ్యానర్ రిజిస్టర్ చేసుకుంది. యంగ్ హీరో ఆది సాయి కుమార్ తో రఫ్ మూవీని తెరకెక్కించిన డైరెక్టర్ సీ. హెచ్ సుబ్బారెడ్డి.. ఆ సినిమాను తీస్తున్నారు. దీంతో అదే పేరుతో రాజమౌళి ఎలా రిలీజ్ చేస్తారోనని అంతా డిస్కస్ చేసుకుంటున్నారు. అయితే ఆయన.. వారణాసి టైటిల్ పై చిన్న అక్షరాలతో ఇంగ్లీష్ లో ఎస్ ఎస్ రాజమౌళి స్ అని వేశారు. దీంతో SS RAJAMOULI;S వారణాసి అనే టైటిల్ తో రిలీజ్ చేస్తారని కొందరు అంచనా వేశారు. ఇప్పుడు అదే నిజమని తెలుస్తోంది. తెలుగు టైటిల్ హక్కుల విషయంలో అలా గందరగోళం నెలకొనగా.. ఆ సందిగ్ధత తొలగినట్టుగా కనిపిస్తోంది. తెలుగులో రాజమౌళి వారణాసి అనే టైటిల్ తో సినిమాను విడుదల చేయనున్నారని సమాచారం. పాన్ వరల్డ్ రేంజ్ లో మిగతా భాషల్లో వారణాసి టైటిల్ తో సినిమాను రిలీజ్ చేయబోతున్నారని తెలుస్తోంది. త్వరలో ఆ విషయంపై సోషల్ మీడియాలో అధికారిక ప్రకటన కూడా ఇవ్వనున్నారని సమాచారం. తద్వారా తెలుగులో టైటిల్ పై ఎలాంటి ఇష్యూ రాకుండా రాజమౌళి ప్లాన్ చేసినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇక సినిమా విషయానికొస్తే.. మహేష్ బాబు పవర్ ఫుల్ రోల్ రుద్రగా కనిపించనున్నారు. ప్రతినాయకుడిగా మాలీవుడ్ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కుంభ పాత్రలో నటిస్తున్నారు. ప్రియాంక చోప్రా మందాకినిగా యాక్ట్ చేస్తున్నారు. ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ సంగీతాన్ని అందిస్తున్నారు. దుర్గా ఆర్ట్స్ బ్యానర్ పై కేఎల్ నారాయణ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 2027 వేసవిలో మూవీని రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## మాస్ రాజా.. మళ్లీ హిట్ రూట్లోనే డబుల్ ప్లాన్



మాస్ మహారాజా రవితేజ ఎనర్జీకి తిరుగులేదు కానీ, బాక్సాఫీస్ లెక్కలు మాత్రం ఈ మధ్య అనుకూలంగా ఉండటం లేదు. వరుస పెట్టి సినిమాలు చేస్తున్నా, విజయాలు మాత్రం అందని ద్రాక్షలా మారాయి. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో వచ్చిన 'మిస్టర్ బచ్చన్', 'మాస్ జాతర' ఫలితాలు రవితేజ మార్కెట్ ను గట్టిగానే దెబ్బతీశాయి. కనీసం ఓపెనింగ్స్ కూడా రాబట్టలేకపోవడం ఫ్యాన్స్ ను కలవరపెడుతోంది. దీంతో ఇప్పుడు రవితేజ ప్రయోగాలు పక్కన పెట్టి, ఒక పక్కా సేఫ్ ప్రాజెక్ట్ కోసం చూస్తున్నట్లు అర్థమవుతోంది. గత కొంతకాలంగా రవితేజ కెరీర్ గ్రాఫ్ గమనిస్తే, సోలో హీరోగా ఆయనకు వచ్చిన సాలిడ్ బ్లాక్ బస్టర్ కేవలం 'ధమాకా' మాత్రమే. మధ్యలో 'వాల్తేరు వీరయ్య' లాంటి మెగా హిట్ ఉన్నా, అది మల్టీస్టారర్ కాబట్టి క్రెడిట్ చిరంజీవికి కూడా వెళ్తుంది. ఇక రావణాసుర'టైగర్ నాగేశ్వరరావు, ఈగల్ వంటివన్నీ బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచినవే. అందుకే ఇప్పుడు మళ్ళీ తనకు కలిసొచ్చిన మ్యాజిక్ ను రిపీట్ చేయడానికి రవితేజ సిద్ధమవుతున్నాడు. లేటెస్ట్ గా ఇండస్ట్రీలో వినిపిస్తున్న వార్త ఫ్యాన్స్ లో కొత్త జోష్ నింపుతోంది. రవితేజకు 'ధమాకా' వంటి హిట్ ఇచ్చిన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ, ఇటీవల ఫిల్మ్ ఛాంబర్ లో "డబుల్ ధమాకా" అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ ను రిజిస్టర్ చేయించిందట. ఈ టైటిల్ చూడగానే ఇది పక్కా రవితేజ కోసమే అని, మళ్ళీ ఆ హిట్ సెంటిమెంట్ ను వాడుకోబోతున్నారని ఇండస్ట్రీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ ప్రాజెక్ట్ కోసం పాత సక్సెస్ ఫుల్ కాంబినేషన్ ను రంగంలోకి దింపుతున్నట్లు టాక్. దర్శకుడు త్రినాథ రావు నక్కిన దర్శకత్వంలో, రవితేజ శ్రీలీల జోడీ మరోసారి సందడి చేసే అవకాశం ఉందని టాక్. గతంలో వీరిద్దరి కెమిస్ట్రీ, శ్రీలీల ఎనర్జిటిక్ డ్యాన్సులు సినిమా విజయానికి ప్రధాన కారణంగా నిలిచాయి. ఇప్పుడు 'డబుల్' అంటూ వస్తున్నారంటే, ఎంటర్టైన్మెంట్ డోస్ కూడా డబుల్ ఉండేలా ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. రవితేజ ఇటీవల మాస్ ఎంటర్టైనర్స్ తీసినా కూడా ఫ్లాప్స్ అవుతున్నట్లు మాస్ జాతర నిరూపించింది. అలాగని ఫ్యాన్స్ అవి కోరినట్లు కాదు. రెగ్యులర్ కంటెంట్ తో కాకుండా కాస్త కొత్తగా ఉండాలని కోరుకుంటున్నారు. ఇక ఇప్పుడు మళ్లీ సీరియస్ రోల్స్ కంటే, రవితేజ మార్క్ కామెడీ, మాస్ మేనరిజమ్స్ ఉంటేనే సినిమా సేఫ్ జోన్ లో ఉంటుందని మేకర్స్ గ్రహించినట్లున్నారు. వరుస డిజాస్టర్ల తర్వాత రవితేజ తీసుకున్న ఈ నిర్ణయం ఆయన కెరీర్ కు చాలా కీలకం కానుంది. హిట్ ఇచ్చిన బ్యానర్, కలిసొచ్చిన డైరెక్టర్, లక్కీ హీరోయిన్.. ఈ కాంబో కనుక సెట్ అయితే రవితేజ బౌన్స్ బ్యాక్ అవ్వడం ఖాయం. మరి కాంబినేషన్ పై అఫీషియల్ క్లారిటీ ఎప్పుడు వస్తుందో చూడాలి.

## ఎలాంటి హడావిడి లేకుండా బుట్టబొమ్మ బర్త్ డే పార్టీ

అనిఖా సురేంద్రన్ గురించి కొత్తగా పరిచయం అక్కర్లేదు. మలయాళ నటి అయిన అయిన అనిఖా బాల నటిగానే కెరీర్ ను స్టార్ట్ చేసింది. 2010లో మలయాళ సినిమా కదా తుడారున్నుతో నటిగా పరిచయమైన అనిఖా ఆ తర్వాత యెన్నై అరిందాల్, విశ్వాసం లాంటి సినిమాల్లో నటించి తన యాక్టింగ్ తో అందరినీ మెప్పించింది. 2013లో 5 సుందరికల్ సినిమాలో తన పాత్రకు బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ గా కేరళ రాష్ట్ర చలన చిత్ర అవార్డును గెలుచుకున్న అనిఖా తర్వాత కేవలం మలయాళంలోనే కాకుండా తమిళ, తెలుగు సినిమాల్లో కూడా నటిస్తోంది.

**21 ఏళ్లు పూర్తి చేసుకున్న బుట్టబొమ్మ...** తెలుగులో బుట్టబొమ్మ అనే సినిమాను చేసిన అనిఖా రీసెంట్ గా 21 ఏళ్లు పూర్తి చేసుకుంది. అయితే తన బర్త్ డే పార్టీని అనిఖా భారీగా కాకుండా తన ఇంట్లోనే ఫ్రెండ్స్ తో కలిసి చాలా సాదాసీదాగా సెలబ్రేట్ చేసుకుంది. ఈ పార్టీలో అందరూ ఎలాంటి హడావిడి లేకుండా చాలా సరదాగాగా



కనిపించారు. మామూలుగా సెలబ్రిటీలు ఎవరైనా తమ పుట్టినరోజులను చాలా గ్రాండ గా సెలబ్రేట్ చేసుకుంటారు. కానీ అనిఖా మాత్రం అందరికీ భిన్నంగా చాలా సైలెంట్ గా చేసుకుంది. బర్త్ డే పార్టీ ఫోటోలను అనిఖా సోషల్ మీడియాలో షేర్ చేయగా ఆ ఫోటోల్లో బుట్టబొమ్మ బ్లాక్ డ్రెస్ లో కేక్ పక్కన నిలబడి ఎంతో అందంగా కనిపించింది. అంతేకాదు, ఎలాంటి హంగూ ఆర్భాటాలు లేకుండా జరిగిన పార్టీ కావడంతో ఆ ఫోటోలు కూడా చాలా నేచురల్ గా అనిపిస్తున్నాయని నెటిజన్లు ఆ ఫోటోలకు కామెంట్స్ చేస్తున్నారు.

**2025లో కలిసి రాని లక్...** ఇక కెరీర్ పరంగా చూసుకుంటే అనిఖా సురేంద్రన్ ఈ ఇయర్ అనుకున్న రిజల్ట్ ను అందుకోలేకపోయింది. ఆల్రెడీ ఈ ఇయర్ అనిఖా నుంచి రెండు సినిమాలొచ్చాయి. నిలవకు ఎన్ మేల్ ఎన్నడి కోబమ్, ఇంద్ర అనే తమిళ సినిమాలు రిలీజవగా, ఆ రెండు సినిమాలూ ఆశించిన ఫలితాల్ని అందుకోలేకపోయాయి. మరి అనిఖాను సక్సెస్ దారిలోకి ఏ సినిమా తీసుకొస్తుందో చూడాలి.

## 2026 లో లేడీ సూపర్ స్టార్ లైనప్ ఇలా!

లేడీ సూపర్ స్టార్ నయనతార 2025 లో టెస్ట్ అనే ఒకే ఒక్క చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించింది. గత ఏడాది కూడా బియోండ్ ది ఫెయిరీ టేల్ అనే చిత్రంతోనే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇలా రెండేళ్ల కాలంలో కేవలం రెండు సినిమాలతోనే థియేటర్లోకి వచ్చింది. దీంతో వెండి తెరపై నయన్ కనిపించి చాలా గ్యాప్ వచ్చినట్లు అభిమానులు భావిస్తున్నారు. కానీ కొత్త ఏడాదిలో మాత్రం 2024-25 లెక్కలన్నింటిని సరిచేయబోతుంది.

అమ్మడు 2026లో వరుస సినిమాలతో అలరించడం ఖాయం. మనాన్ ఘాటీ సిన్స్ 1960 షూటింగ్ ఇప్పటికే పూర్తి చేసింది.

**ఆన్ సెట్స్ లో బిజీ బిజీగా:** ప్రస్తుతం ఆ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. వచ్చే ఏడాది ఆరంభంలోనే ఆసినిమా రిలీజ్ కానుంది. అలాగే తమిళ్, మలయాళంలో తెరకెక్కిన డియర్ స్టూడెంట్స్ అనే చిత్రం కూడా విడుదలవుతుంది. ఆసినిమా కూడా చిత్రీకరణ ముగించుకుని నిర్మాణానంతర పనుల్లో ఉంది. జనవరిలో సంక్రాంతి కానుకగా రిలీజ్ అవుతున్న మన శంకర వరప్రసాద్ గారు చిత్రంతోనూ అలరించనుంది. ఇందులో అమ్మడు మెగాస్టార్ చిరంజీవికి జోడీగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే టాక్సిక్ అనే పాన్ ఇండియా చిత్రంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. యశ్ హీరోగా నటిస్తోన్న చిత్రమిది.

**నయన్ నామ సంవత్సరం...** సమ్మర్ కానుకగా చిత్రం రిలీజ్ కానుంది. పేట్రియేట్ అనే మలయాళం చిత్రంలోనూ నటిస్తోంది. అలాగే తమిళ్



లో మూకుత్తి అమ్మన్ 2 , హాయ్,రఖియే అనే మరో మూడు చిత్రాల్లోనూ నటిస్తోంది. ఈ మూడు షూటింగ్ దశలో ఉన్నాయి. వీటిలో రెండు చిత్రాలు 2026 మిడ్ లో, మరో సినిమా ఏడాది ముగింపులో రిలీజ్ కానున్నాయి. తాజాగా నటసింహ బాలకృష్ణ 111వ చిత్రంలోనూ హీరోయిన్ గా ఎంపికైన సంగతి తెలిసిందే. బాలయ్య తో కలిసి నాల్గవ సారి నటిస్తోంది. మొత్తంగా 2026 లో అమ్మడు తొమ్మిది రిలీజ్ లతో ప్రేక్షకుల్ని అలరించడం ఖాయం. చాలా కాలం త ర్వాత నయన్ ఒకే సారి ఇన్ని సినిమాలతో రావడం ఇదే.

**2026 లో ఫుల్ జోష్ తో:** సక్సస్ తో నిలదొక్కుకున్న సమయంలో ఒకే ఏడాది ఆరేడు సినిమాలతో ప్రేక్షకుల మధ్యలో ఉండేది. కాల క్రమంలో అమ్మడు సినిమాల సంఖ్య తగ్గించింది. దీంతో రిలీజ్ లు తగ్గాయి. లేడీ ఓరియేంటెడ్ చిత్రాల్లో నటించాలి అన్న ఆసక్తి కారణంగా చాలా సమయాన్ని వృద్ధా చేసింది. కొన్ని కథలు నచ్చినా సరైన దర్శకులు సెట్ కాకపో వడం..మరికొన్ని నచ్చక పోవడంతో పట్టాలెక్కడంలో జాప్యం చోటు చేసుకుంది. కొత్త ఏడాదిలో మాత్రం వరుస రిలజ్ లతో అభిమానుల్లో మళ్లీ జోష్ నింపనుంది.

Printed, Published, and Owned by **KOKKU RAVI KUMAR** Editor: **KOKKU RAVI KUMAR**, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003.
Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com